www.flashindianews.com

FLASH INDIA NEWS
ప్రతిక్షణం.. ప్రజలకోసం...

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

| సంపుటి : 17 | సంచిక : 160 | గురువారం 30.07.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/- |
|---|---|---|---|---|---|



విలేకరులు కావలెను

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039


పాసైన యాంటీ పేపర్

# లీక్ బిల్లు

## 'వందేమాతరం' సవరణ బిల్లుకు రాజ్యసభ ఆమోదం..

10 ఏళ్ల వరకు జైలు శిక్ష రూ.5 కోట్ల వరకు భారీ జరిమానా

దేశవ్యాప్తంగా ప్రభావం చూపే మూడు కీలక నిర్ణయాలు

- వందేమాతరానికి మరింత బలమైన చట్టపరమైన రక్షణ
- జాతీయ గౌరవ చట్టంలో కీలక సవరణలు
- పేపర్ లీక్ గ్యాంగ్‌లపై రూ.5 కోట్ల వరకు జరిమానా
- ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్లో పేపర్ లీక్ కేసుల విచారణ
- రెండు నెలల్లో దర్యాప్తు పూర్తి చేయాలని కొత్త నిబంధన
- రబ్బర్ పార్ట్స్ మారిస్తే సరిపోతుందన్న గడ్కరీ
- శాస్త్రీయ పరీక్షల తర్వాతే ఈ20 అమలు: కేంద్రం
- జాతీయ గేయ అవమానంపై కఠిన చట్టానికి గ్రీన్ సిగ్నల్
- రాజ్యసభలో ఆమోదం పొందిన వందేమాతరం సవరణ బిల్లు

02

విద్య, జాతీయ గౌరవం, ఇంధనంపై కేంద్రం కీలక నిర్ణయాలు



**న్యూ ఢిల్లీ :** ఇక నుంచి పేపర్ లీకేజీలకు పాల్పడే వ్యక్తులు, గ్యాంగ్‌లు, అధికారులకు విధించే కనీస జైలు శిక్షను 5 ఏళ్ల నుంచి 10 ఏళ్ల వరకు పెంచారు. అక్రమాలకు పాల్పడే వ్యక్తులకు రూ. 50 లక్షల వరకు జరిమానా విధించేలా బిల్లును రూపొందించారు. పరీక్షలు నిర్వహించే ప్రైవేట్ ఏజెన్సీలు, సంస్థలు, ముఠాలకు రూ. 5 కోట్ల వరకు భారీ జరిమానా విధించడంతో పాటు, ఆ పరీక్ష నిర్వహణకు అయిన మొత్తం వ్యయాన్ని వారి నుంచే వసూలు చేయనున్నారు. పేపర్ లీక్ కేసులను కేంద్ర దర్యాప్తు సంస్థలు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఈ కేసుల విచారణను 2 నెలల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది.

## బీఎస్-3 వాహనాల్లో ఆ పార్ట్స్ మార్చాల్సిందే

ఇంజిన్‌లో మార్పులు అక్కర్లేదు..

శాస్త్రీయ పరీక్షల తర్వాతే ఈ20 అమలు

ల్యాబ్ పరీక్షల్లో ఈ20కు గ్రీన్ సిగ్నల్

# 'సర్' వేగవంతం చేయాలి

'సర్' ప్రక్రియ 60 శాతం పూర్తయింది



- బీఎల్ఏల పనితీరును ప్రశంసించిన భట్టి
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి
- జిల్లాల వారీగా నివేదికలు ఇవ్వాలని భట్టి ఆదేశం
- రెండు, మూడు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేస్తాం
- ఓటు హక్కు పరిరక్షణే కాంగ్రెస్ లక్ష్యం
- పార్టీ-ప్రభుత్వ సమన్వయంపై విస్తృత చర్చ
- తెలంగాణ రాజకీయాలపై కాంగ్రెస్ సమీక్ష
- సమన్వయ కమిటీ పనితీరుపై సమీక్ష సమావేశం

03

పార్టీ-ప్రభుత్వ సమన్వయానికి కాంగ్రెస్ కొత్త కార్యాచరణ

# భారత్ లో భారీగా పెరిగిన కోటీశ్వరులు

ఐటీ రిటర్న్ ఆధారంగా వెలుగులోకి వచ్చిన వివరాలు

అసమానతలు తగ్గించేందుకు ప్రభుత్వ చర్యలు

2021-22లో 142 మంది.. 2025-26 నాటికి 576 మంది

పేద-ధనిక అంతరాన్ని తగ్గించే దిశగా చర్యలు



- ఐదేళ్లలో నాలుగు రెట్లు పెరిగిన కోటీశ్వరుల సంఖ్య
- పార్లమెంట్‌లో కేంద్రం వెల్లడించిన తాజా గణాంకాలు
- 2021-22లో 142 మంది.. 2025-26 నాటికి 576 మందికి పెరుగుదల
- ఐటీ రిటర్న్ ఆధారంగా వెలుగులోకి వచ్చిన వివరాలు
- ఆర్థిక వృద్ధితో పాటు పెరుగుతున్న అధిక ఆదాయ వర్గం
- సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: ఆర్థిక శాఖ

05



# అగ్రనేత మిసిర్ బెస్రా అరెస్ట్

- కేంద్ర కమిటీలో చివరి అగ్రనేత కూడా అరెస్ట్
- మావోయిస్టు కేంద్ర కమిటీకి భారీ దెబ్బ
- పొలిట్‌బ్యూరోలో మిగిలిన ఏకైక అగ్రనేత అదుపులో
- మావోయిస్టు నాయకత్వానికి ముగింపు దశ?
- కేంద్ర కమిటీ పూర్తిగా నిర్వీర్యమైనట్లేనా?

05

ఒకప్పుడు 40 మందికి పైగా సభ్యులు ఉన్న కేంద్ర కమిటీలోని నేతలను భద్రతా బలగాలు వరుస ఎన్‌కౌంటర్లు, అరెస్టులు, లొంగిబాటల ద్వారా మట్టుబెట్టగా, రెండ దశాబ్దాలుగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న బెస్రా కూడా ఇప్పుడు పట్టుబడ్డారు.



## ట్రైనీ ఐపీఎస్ అరెస్ట్..

మహిళా ట్రైనీ ఐపీఎస్‌కు వైద్య పరీక్షలు!

- లైంగిక వేధింపుల కేసులో కీలక పరిణామం
- మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదుతో నమోదైన కేసు
- ఫిర్యాదు తర్వాత వేగంగా మారిన పరిణామాలు
- దర్యాప్తును ముమ్మరం చేసిన పోలీసులు
- కేసులో కీలక ఆధారాల సేకరణ కొనసాగింపు

05

# రాహుల్ వర్సెస్ కేంద్రం..

రాహుల్ ప్రసంగం మధ్యలో మైక్ కట్..

అమిత్ షాకు క్షమాపణ చెప్పాలన్న కిరణ్ రిజిజు

రాహుల్ వ్యాఖ్యలతో లోక్‌సభలో దుమారం

అమిత్ షాకు క్షమాపణ చెప్పాలన్న కిరణ్ రిజిజు

- లోక్‌సభలో రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు
- విద్యార్థుల నిరసనపై కేంద్రాన్ని టార్గెట్ చేసిన రాహుల్
- అమిత్ షాపై రాహుల్ తీవ్ర విమర్శలు.. సభలో దుమారం
- పేపర్ లీక్ అంశంపై పార్లమెంట్‌లో రాజకీయ రగడ
- రాహుల్ ప్రసంగం మధ్యలో మైక్ కట్.. విపక్షం నిరసన
- విద్యార్థుల ఆందోళనపై కేంద్ర-విపక్షాల మధ్య మాటల యుద్ధం
- విద్య, పేపర్ లీక్‌లపై కేంద్రాన్ని నిలదీసిన కాంగ్రెస్

03



# సైబర్ మోసాల్లో తెలంగాణ టాప్..

ఏటికేడు పెరుగుతున్న సైబర్ మోసాలు

- రాజ్యసభలో కేంద్రం షాకింగ్ గణాంకాలు
- సైబర్ నేరాలపై బండి సంజయ్ కీలక వివరాలు
- దేశవ్యాప్తంగా పెరుగుతున్న డిజిటల్ మోసాలు
- ఎన్‌సీఆర్‌బీ గణాంకాలు బహిర్గతం చేసిన కేంద్రం
- సైబర్ నేరాలపై కేంద్రం హెచ్చరిక

02






## మన్మోహన్ సింగ్ కు క్లీన్ చిట్

- సీబీఐ క్లోజర్ రిపోర్టుకు సుప్రీంకోర్టు ఆమోదం
- ప్రత్యేక కోర్టు నిర్ణయాన్ని తప్పుబట్టిన ధర్మాసనం
- దీర్ఘకాల విచారణకు తెరదించిన అత్యున్నత న్యాయస్థానం

03

మోడీ ప్రభుత్వాన్ని అన్ని వైపుల నుంచి చుట్టుముడదాం..

# రైతులతో కలిసి కాక్రోచ్‌ల ప్లాన్..



## రాకేష్ టికాయత్‌తో సీజేపీ కీలక భేటీ

- ఢిల్లీలో రైతు నాయకుడు రాకేష్ టికాయత్‌తో సీజేపీ నేతల భేటీ.
- రైతులు, విద్యార్థులు, యువతకు ఉమ్మడి వేదిక ఏర్పాటు లక్ష్యంగా చర్చలు.
- విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణకు టికాయత్ మద్దతు కోరిన సీజేపీ.
- రైతులు, విద్యార్థులతో మోడీ ప్రభుత్వాన్ని చుట్టుముట్టాలన్న సీజేపీ..

03

దేశవ్యాప్త ఉద్యమానికి రైతు సంఘాల మద్దతు కోరిన సీజేపీ

# సుప్రీంకోర్టు కీలక నిర్ణయం..

## ఇక లైవ్ స్ట్రీమింగ్‌లో ఆ మాటలు వినిపించవు

**న్యూ ఢిల్లీ :** సుప్రీంకోర్టు లైవ్ స్ట్రీమింగ్ చూసేవారికి ఇకపై ఓ కీలక సమయంలో మాటలు వినిపించవు. అత్యవసర కేసుల విచారణకు సంబంధించి ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ముందు న్యాయవాదులు చేసే అభ్యర్థనలు, ఆ సమయంలో జరిగే సంభాషణల ఆడియోను మ్యూట్ చేయాలని సుప్రీంకోర్టు బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. దీనివల్ల లైవ్ వీడియో ఫీడ్ కనిపిస్తుంది కానీ, లాయర్లు అడిగే అత్యవసర అంశాలు, దానికి కోర్టు ఇచ్చే మౌఖిక సమాధానాలు, వ్యాఖ్యలు ఇకపై సామాన్య ప్రజలకు, మీడియాకు వినపడవు. ఈ నిర్ణయం వెనుక ఓ బలమైన కారణం ఉంది. అత్యవసర కేసుల విచారణ కోసం లాయర్లు చేసే అభ్యర్థనలు (మెన్షనింగ్) కేవలం పరిపాలనాపరమైన ప్రక్రియ మాత్రమేనని, అది న్యాయపరమైన విచారణ కిందకు రాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కొద్దిరోజుల క్రితమే స్పష్టం చేశారు. అందువల్ల ఆ సమయంలో జరిగే సంభాషణలను వార్తలుగా ప్రసారం చేయకూడదని అభిప్రాయపడ్డారు. ఆ వ్యాఖ్యలకు అనుగుణంగానే తాజాగా ఈ ఆడియో మ్యూట్ విధానాన్ని అమలులోకి తెచ్చారు. ఇటీవల కాలంలో, రాజకీయంగా ప్రాధాన్యత ఉన్న కేసులు, పిల్స్ ఈ విధంగా ప్రస్తావనకు వచ్చినప్పుడు సీజేఐ చేసే ప్రాథమిక వ్యాఖ్యలను సైతం మీడియా విస్తృతంగా రిపోర్ట్ చేస్తోంది. కొన్నిసార్లు అసలు కేసు విచారణ లాంఛనంగా ప్రారంభం కాకముందే ఈ మౌఖిక సంభాషణలు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. దీన్ని నివారించడానికే ఆడియోను మ్యూట్ చేశారు. కేవలం కేసుల జాబితాను సిద్ధం చేసే ఈ పరిపాలనా ప్రక్రియలో జరిగే సంభాషణలు బయటకు వెళ్లకుండా ఈ చర్య కట్టడి చేస్తుంది. సుప్రీంకోర్టు వర్చువల్ ప్రొసీడింగ్స్ విధానంలో ఇది ఒక గణనీయమైన మార్పు. ఒక కేసు అత్యవసర విచారణకు అర్హమైనదా కాదా అని నిర్ణయించే పరిపాలనా ప్రక్రియకు, అసలు న్యాయ విచారణకు (జ్యుడీషియల్ హియరింగ్) మధ్య స్పష్టమైన రేఖను గీయడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశం. ఈ మార్పుపై కోర్టు ఎలాంటి వివరణాత్మక పబ్లిక్ నోటీసు జారీ చేయనప్పటికీ, ఇది పూర్తిగా ప్రధాన న్యాయమూర్తి గతంలో చేసిన వ్యాఖ్యల ఆచరణగానే స్పష్టమవుతోంది. మొత్తానికి, కేసుల విచారణ మొదలవ్వక ముందే కోర్టు హాల్లో జరిగే ప్రాథమిక సంభాషణలకు ఈ నిర్ణయంతో సుప్రీంకోర్టు తెరదించినట్లయింది.

## జూరాల కాల్వలకు నీటిని విడుదల చేయకుంటే పోరుబాట

**మహబూబ్ నగర్,ఫ్లాష్ ఇండియా :** జూరాల ప్రాజెక్టుకు గత నాలుగు రోజులుగా భారీ వరద ప్రవాహం నమోదవుతున్నప్పటికీ కాల్వలకు నీటిని విడుదల చేయకుండా రైతుల ప్రయోజనాలను పూర్తిగా విస్మరించి కాంగ్రెస్ ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తుందని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులో 7.12 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, సుమారు 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోందని, అయినప్పటికీ వచ్చిన నీటిని జూరాల కుడి, ఎడమ ప్రధాన కాలువలకు విడుదల చేయకుండా విద్యుత్ ఉత్పత్తి పేరుతో దిగువకు విడుదల చేయడం వల్ల పాలమూరు రైతులు సాగునీటికి దూరమవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం పాలమూరు రైతుల అవసరాలను పక్కనపెట్టి శ్రీశైలానికి నీటిని విడుదల చేస్తుందని, తద్వారా ఆ నీరు పోతిరెడ్డిపాడు ద్వారా ఆంధ్రప్రదేశ్ కు వెళ్లే మార్గాన్ని రేవంత్ రెడ్డి సుగమం చేశాడని ఆయన ఆరోపించారు. వెంటనే జూరాల కుడి, ఎడమ ప్రధాన కాలువలకు నీటిని విడుదల చేయకుంటే వేలాది మంది రైతులతో కలిసి జూరాల ప్రాజెక్టును ముట్టడించి, కాలువలకు నీటిని విడుదల చేసే ఉద్యమాన్ని ప్రారంభిస్తామని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు.

# పాసైన యాంటీ పేపర్ లీక్ బిల్లు

**న్యూ ఢిల్లీ :** పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీలు, వ్యవస్థాగత మోసాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'యాంటీ పేపర్ లీక్ బిల్లు-2026' విపక్షాల గందరగోళం నడుమ మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. బిల్లు ఆమోదం అనంతరం స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను రేపటికి వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించారు. బిల్లుపై చర్చ సందర్భంగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీక్ కేసులో కేంద్ర ప్రభుత్వం ఎంతో వేగంగా స్పందించి చర్యలు తీసుకుందని సభకు తెలిపారు. 2024లో పేపర్ లీక్ నిరోధక చట్టం అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని మంత్రి అధికారిక గణాంకాలను సభలో వెల్లడించారు. అయితే, అంతకు ముందుకు తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామ్స్ చట్టం' కఠినంగా అమలు కావడం వల్ల గత కొన్ని ఏళ్లుగా పేపర్ లీకేజీల కారణంగా విద్యార్థులు చేసుకునే ఆత్మహత్యల సంఖ్య గణనీయంగా తగ్గిందని, ఇది చట్టం సాధించిన సానుకూల ప్రభావానికి నిదర్శనమని మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. విపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో విపక్షాల నిరసనలు మిన్నంటినప్పటికీ బిల్లు ఆమోదం పొందింది. అనంతరం స్పీకర్ లోక్‌సభను తదుపరి రోజుకు వాయిదా వేశారు. అంతకు ముందుకు సభలో 'యాంటీ పేపర్ లీక్ బిల్లు-2026' సభలో వాడీవేడిగా చర్చ జరిగింది. చట్టాలను పెంచడం మాత్రమే సరిపోదని, పరీక్షా వ్యవస్థలోని లోపాలను సరిదిద్ది జవాబుదారీతనం పెంచాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. అందుకు అధికార పక్షం స్పందిస్తూ.. బిల్లులో తాజా సవరణలు పరీక్షా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తాయని బదులిచ్చారు.

**ఇక నిందితులకు కఠిన జైలు శిక్ష..**

ఇక నుంచి పేపర్ లీకేజీలకు పాల్పడే వ్యక్తులు, గ్యాంగ్‌లు, అధికారులకు విధించే కనీస జైలు శిక్షను 5 ఏళ్ల నుంచి 10 ఏళ్ల వరకు పెంచారు. అక్రమాలకు పాల్పడే వ్యక్తులకు రూ.50 లక్షల వరకు జరిమానా విధించేలా బిల్లును రూపొందించారు. పరీక్షలు నిర్వహించే ప్రైవేట్ ఏజెన్సీలు, సంస్థలు, ముఠాలకు రూ.5 కోట్ల వరకు భారీ జరిమానా విధించడంతో పాటు, ఆ పరీక్ష నిర్వహణకు అయిన మొత్తం వ్యయాన్ని వారి నుంచే వసూలు చేయనున్నారు. పేపర్ లీక్ కేసులను కేంద్ర దర్యాప్తు సంస్థలు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఈ కేసుల విచారణను 2 నెలల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. కేసులను వేగవంతంగా పరిష్కరించడానికి కొత్తగా ఏర్పాటు చేసే ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్లో రోజువారీ ప్రాతిపదికన విచారణ జరుగుతుంది. అదేవిధంగా రాష్ట్రాల సరిహద్దులు దాటి జరిగే పెద్ద ఎత్తున పరీక్షల మోసాలను విచారించడానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి కల్పించారు. అక్రమాలకు బాధ్యులైన పరీక్షా నిర్వహణ ఏజెన్సీలపై నిషేధ కాలాన్ని 4 ఏళ్ల నుంచి 8 ఏళ్లకు పెంచారు. ఇటీవల నీట్ వంటి పోటీ పరీక్షల్లో చోటుచేసుకున్న వివాదాలు, దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపట్టిన నిరసనల నేపథ్యంలో కేంద్రం ఈ చట్టాన్ని బలపరిచింది. విద్యార్థుల భవిష్యత్తును, విద్యా వ్యవస్థ విశ్వసనీయతను కాపాడేందుకు ఇదొక కీలక అడుగు అని ప్రభుత్వం పేర్కొనగా, విద్యా వ్యవస్థలో జవాబుదారీతనంపై లోక్‌సభలో ఇవాళ విస్తృతంగా చర్చ జరిగిన విషయం తెలిసిందే.

**'వందేమాతరం' సవరణ బిల్లుకు రాజ్యసభ ఆమోదం..**

జాతీయ గేయం 'వందేమాతరం' గౌరవాన్ని కాపాడేందుకు ఉద్దేశించిన కీలక బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ నెల 24వ తేదీన ఎగువసభలో ఈ బిల్లును ప్రవేశపెట్టగా.. నేడు (బుధవారం) సుదీర్ఘ చర్చ అనంతరం సభ ఆమోదముద్ర వేసింది. ఇకపై వందేమాతరాన్ని అవమానించినా, లేదా ఎవరైనా ఆలపిస్తున్న సమయంలో ఉద్దేశపూర్వకంగా ఆటంకం కలిగించినా దాన్ని చట్టప్రకారం తీవ్ర నేరంగా పరిగణించేలా చట్టం చేయనున్నారు. వందేమాతరం బిల్లులో భాగంగా చరిత్రాత్మక 'ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ యాక్ట్ - 1971' (జాతీయ గౌరవానికి భంగం కలిగించే నిరోధక చట్టం)లో కీలక సవరణలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం భారత జాతీయ గీతమైన 'జనగణమన'కు ఎలాంటి చట్టపరమైన రక్షణలు అమల్లో ఉన్నాయో.. అవే అత్యున్నత రక్షణలను జాతీయ గేయమైన వందేమాతరానికి కూడా వర్తింపజేయడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని కేంద్రం స్పష్టం చేసింది.

**బీఎస్-3 వాహనాల్లో ఆ పార్ట్స్ మార్చాల్సిందే: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ**

భారత్‌లో ఈ20 పెట్రోల్ వాడకంపై తలెత్తుతున్న సందేహాలకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ రాజ్యసభలో ఫుల్ క్లారిటీ ఇచ్చారు. ఈ 20 ఇంధనం వల్ల పాత వాహనాల ఇంజిన్లలో ఎలాంటి మార్పులు చేయాల్సిన అవసరం లేదని, అయితే కొన్ని పాత వాహనాలకు చిన్నపాటి విడిభాగాల మార్పిడి అవసరమవుతుందని వెల్లడించారు. ఏప్రిల్ 1, 2005 నుంచి 2016 వరకు మానుఫ్యాక్చర్ అయిన బీఎస్-3 వాహనాల్లో ఈ20 పెట్రోల్ వాడినప్పుడు కొన్ని రబ్బర్ విడిభాగాలు , గాస్కెట్లు దెబ్బతినే అవకాశం ఉందని అన్నారు. వాటిని వాహన సాధారణ సర్వీసింగ్ సమయంలో సులభంగా మార్చుకోవచ్చని నితిన్ గడ్కరీ తెలిపారు.

**ఇంజిన్‌లో మార్పులు అక్కర్లేదు..**

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ , ఐఐపీ డెహ్రాడూన్, సియామ్, ఏఆర్ఏఐ వంటి ప్రముఖ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన విస్తృత పరిశోధనల్లో కార్లు, బైక్‌ల ఇంజిన్లలో ఎలాంటి మార్పులు చేయాల్సిన అవసరం లేదని తేలిందని నితిన్ గడ్కరీ సభలో ప్రస్తావించారు. ఇథనాల్ బ్లెండింగ్ వల్ల వాహన పనితీరు, స్టార్టింగ్, మెటల్,ప్లాస్టిక్ విడిభాగాలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడలేదని అధ్యయనాలు స్పష్టం చేశాయన్నారు. అదేవిధంగా ఈ20 పెట్రోల్ వాడకం వల్ల మైలేజ్ తగ్గుతుందనే ఆందోళనలపై స్పందిస్తూ.. మైలేజ్ అనేది అనేక అంశాలపై ఆధారపడి ఉంటుందని, కేవలం ఇథనాల్ ఇంధనం వల్ల మాత్రమే మైలేజ్ మారదని వాహన తయారీదారులు, టెస్టింగ్ ఏజెన్సీలు స్పష్టం చేశాయని పేర్కొన్నారు. సైంటిఫిక్‌గా అన్ని రకాల ల్యాబ్ పరీక్షలు, డ్యూరబిలిటీ ట్రయల్స్ పూర్తి చేసిన తర్వాతే కేంద్ర ప్రభుత్వం దశలవారీగా
ఈ20 ఇంధన కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అమలు చేసిందని మంత్రి నితిన్ గడ్కరీ రాజ్యసభకు వివరించారు.


# ఉగ్రరూపం దాల్చిన 'తెలంగాణ నయాగరా'..

**ములుగు,ఫ్లాష్ ఇండియా :** ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ప్రకృతి మాయాజాలం ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చింది. గడచిన రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలకు 'తెలంగాణ నయాగరా'గా పేరొందిన బొగత జలపాతం నిండుకుండలా మారి హోరెత్తుతోంది. వాజేడు మండలం చీకుపల్లి అటవీ ప్రాంతంలోని ఈ జలపాతం ఎగువ ప్రాంతాల నుంచి ఉమ్మడిగా తరలివస్తున్న భారీ వరదతో పరవళ్లు తొక్కుతోంది. సుమారు 160 మీటర్ల వెడల్పున, 50 అడుగుల ఎత్తు నుంచి నురగలు కక్కుతూ ఐరావతాన్ని తలపించేలా పడుతున్న జలధారలు ఒకవైపు పర్యాటకులను కట్టిపడేస్తున్నా, మరోవైపు దాని ఉధృతి భయాందోళనలు రేకెత్తిస్తోంది.

**మునిగిపోయిన కారిడార్.. పర్యాటకులకు 'నో ఎంట్రీ'**

వరద తాకిడి తీవ్రంగా ఉండటంతో బొగత జలపాతం వద్ద పర్యాటకుల భద్రత కోసం ఏర్పాటు చేసిన రక్షణ వలయం (సేఫ్టీ కారిడార్) పూర్తిగా నీటమునిగింది. నీటి ప్రవాహం ఏ క్షణంలోనైనా ప్రమాదకరంగా మారే అవకాశం ఉండటంతో అటవీశాఖ అధికారులు తక్షణమే స్పందించారు. పర్యాటకుల ప్రాణరక్షణే ధ్యేయంగా జలపాతం సందర్శనను తాత్కాలికంగా పూర్తిగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అధికారుల నుంచి మళ్లీ అనుమతులు వచ్చే వరకు పర్యాటకులు ఎవరూ బొగత జలపాతం వైపు రావద్దని, ముందస్తు సమాచారం లేకుండా ప్రయాణాలు పెట్టుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

**నిండిన పాలెంవాగు ప్రాజెక్టు: నాలుగు గేట్లు ఎత్తివేత**



మరోవైపు, పక్కనే ఉన్న వెంకటాపురం మండలంలోనూ వర్షాల ప్రభావం తీవ్రంగా ఉంది. అక్కడ నిర్మించిన పాలెంవాగు ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టానికి చేరుకోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టు భద్రతను దృష్టిలో ఉంచుకుని నాలుగు క్రస్ట్ గేట్లను పైకెత్తి మిగులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, వాగులు, వంకల వైపు వెళ్లకూడదని స్థానిక యంత్రాంగం హెచ్చరించింది.






# సైబర్ మోసాల్లో తెలంగాణ టాప్..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దేశంలో 2020 నుంచి 2024 మధ్య కాలంలో సైబర్ మోసాలు మూడింతలు పెరిగాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2024 నాటికి అత్యధికంగా 18,922 సైబర్ కేసుల నమోదుతో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొంది. ఆ తర్వాతి స్థానాల్లో బీహార్ (4,020), మహారాష్ట్ర (2,827), ఒడిశా (1,546) నిలిచాయని తెలిపింది. ఈ మేరకు రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. సైబర్ నేరాల్లో ఎంత డబ్బు కోల్పోయారు లేదా ఎంత రికవరీ చేశారనే పూర్తి సమాచారాన్ని ఎన్‌సీఆర్‌బీ ప్రత్యేకంగా నిర్వహించదని మంత్రి స్పష్టం చేశారు.

**ఏటికేడు పెరుగుతున్న సైబర్ మోసాలు:**

సైబర్ నేరాలు ఏటికేడు పెరుగుతున్నట్లు కేంద్రం పేర్కొంది. 2020లో దేశవ్యాప్తంగా 10,395 కేసులు నమోదు కాగా 2021లో 14,007 కేసులు, 2022లో 17,470, 2023లో 19,466, 2024లో 29,758 కేసులు నమోదైనట్లు తెలిపింది. వీటిలో సైబర్ నేరాల్లో అత్యధికంగా ఆన్‌లైన్ బ్యాకింగ్ ఫ్రాడ్స్ అత్యధికంగా ఉన్నట్లు తెలిపింది. 2024లో ఆన్‌లైన్ బ్యాంకింగ్ ఫ్రాడ్స్ కేసులు 4,659 నమోదు కాగా, క్రెడిట్/డెబిట్ కార్డ్ మోసాలు 3,829, మార్కెటింగ్/పెట్టుబడుల పేరిట మోసాలు 3,044, ఏటీఎం మోసాలు 1,659, ఫేక్ కాల్స్/విషింగ్ 1,264, గేమింగ్ యాప్స్/వెబ్‌సైట్ మోసాలు 1,019, ఓటీపీ ఫ్రాడ్స్ 965, ఈ-వాలెట్/యూపీఐ మోసాలు: 723 నమోదైనట్లు వెల్లడించింది.

**నివారణ చర్యలు:**

సైబర్ నేరాలను అరికట్టేందుకు కేంద్ర హోంశాఖ ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ని ఏర్పాటు చేసిందని మంత్రి బండి సంజయ్ తెలిపారు. 'సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్'
ద్వారా 2026 జూన్ 30 నాటికి సుమారు 32.80 లక్షల ఫిర్యాదులకు సంబంధించి రూ.11,158 కోట్లకు పైగా బాధితుల సొమ్ము కాపాడగలిగినట్లు ఆయన పేర్కొన్నారు.


ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# సీజేపీ నిరసనపై జేపీ నడ్డా ఫైర్

**న్యూ ఢిల్లీ :** విద్యార్థి ఉద్యమాలు, పోలీస్ చర్యలు, పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళనలతో దేశ రాజకీయం తీవ్ర ఉత్కంఠగా మారింది. విద్యార్థి నేతలపై పోలీసుల దాడులపై అధికార, ప్రతిపక్షాల నడుమ పార్లమెంట్ వేదికగా విమర్శల యుద్ధం నడిచింది. నిరసనల్లో పాల్గొనే విద్యార్థులను అదుపులోకి తీసుకోవడం సహజమేనని, శాంతిభద్రతలను అదుపులోకి తెచ్చేందుకు పోలీసు చర్యలు పూర్తిగా సమర్థనీయమని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి, రాజ్యసభ నాయకుడు జేపీ నడ్డా స్పష్టం చేశారు. విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొనేవారు పోలీస్ చర్యలకు సిద్ధపడాల్సిందేనంటూ వ్యాఖ్యానించారు. అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) రోజుల్లో విద్యార్థి నాయకుడిగా ఉన్న తాను కూడా క్లాస్‌రూమ్ నుంచే రెండుసార్లు అరెస్ట్ అయ్యానని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అయితే బీజేపీ పాలనలో దేశంలో ప్రజాస్వామ్యానికి, ప్రజల ప్రాణాలకు ఏమాత్రం రక్షణ లేకుండా పోయిందని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ విపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ఘాటుగా విమర్శించారు. జులై 20న విద్యార్థి నిరసనకారులపై క్రూరంగా దాడి చేసిన వాళ్లు ఇంకా నిర్భయంగా తిరుగుతున్నారని మండిపడ్డారు. ఈ పోలీస్ క్రూరత్వంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే పార్లమెంట్‌లో సమాధానం చెప్పాలని, అలాగే ప్రధాని నరేంద్ర మోడీ దీనిపై దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని విపక్షాలు పట్టుబట్టాయి. మరోవైపు, సీపీఐ(ఎమ్) జాతీయ కార్యాలయంలోకి ఢిల్లీ పోలీసులు అకస్మాత్తుగా ప్రవేశించి, విద్యార్థి నాయకురాలు ఐషే ఘోష్‌ను అరెస్ట్ చేయడానికి యత్నించిన ఘటన ఈ వివాదానికి మరింత ఆజ్యం పోసింది. జంతర్ మంతర్ వద్ద నిరసనలో పాల్గొనడమే ఆమె చేసిన ఏకైక నేరమా అని సీపీఐ(ఎమ్) ఎంపీ జాన్ బ్రిట్టాస్ రాజ్యసభలో ప్రశ్నించారు. ఒక జాతీయ పార్టీ కేంద్ర కార్యాలయంలోకి చొరబడి దాడులు చేయడంపై తాను స్వయంగా పోలీసులను నిలదీశానని, అయితే 2021 నాటి జేఎన్యూ నిరసన కేసును సాకుగా చూపించారని ఆయన ఆరోపించారు. విపక్షాల నిరసనలను అణచివేయడానికే కేంద్రం ఇలాంటి దమనకాండకు ఒడిగడుతోందని దుయ్యబట్టారు. సభలో ఇతర కార్యకలాపాలు చేపట్టే ముందే హోంమంత్రి దీనిపై ప్రకటన చేయాలంటూ విపక్షాలు చేపట్టిన ఆందోళనలతో లోక్‌సభ తీవ్ర గందరగోళంగా మారింది. పేపర్ లీక్ నిరోధక బిల్లుపై ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మాట్లాడటానికి ముందు కూడా ప్రతిపక్షాలు రగడను కొనసాగించడంతో, సభను వాయిదా వేస్తానని స్పీకర్ హెచ్చరించాల్సి వచ్చింది. మరోవైపు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ సైతం ఈ ఘటనపై తీవ్రంగా స్పందిస్తూ.. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై టియర్ గ్యాస్ ప్రయోగించి, బలప్రయోగం చేయడం అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) కాలం నాటి రజకార్ల అణచివేత కంటే అత్యంత ఘోరంగా ఉందని, దేశంలో అణచివేత వాతావరణం స్పష్టంగా కనిపిస్తోందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.



# రైతులతో కలిసి కాక్రోచ్‌ల ప్లాన్..

**న్యూ ఢిల్లీ :** నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ఉద్యమించిన సంగతి తెలిసిందే. ఉద్యమం తర్వాత విద్యాశాఖ మంత్రిగా ఉన్న ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అయితే, ఇప్పుడు సీజేపీ మరో ప్లాన్‌కు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకోవాలన్న డిమాండ్‌పై ఉద్యమించిందేకు అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో సీజేపీ నాయకులు ఢిల్లీలో రైతు ఉద్యమ నాయకుడు రాకేష్ టికాయత్‌ను కలిశారు. రైతులు-విద్యార్థులు-యువత కలిసి ఉమ్మడి వేదికపై పోరాటం చేయాలని భావిస్తున్నారు. సీజేపీ అధికార ప్రతినిధి అశుతోష్ రాంకా, ఇతర కాక్రోచ్ ప్రతినిధులు, భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) నాయకులతో కలిసి టికాయత్‌తో సమావేశమయ్యారు. భవిష్యత్తులో రైతులు, యువత కలిసి చేపట్టబోయే వ్యూహాలపై చర్చించారు. ఈ సమావేశం తర్వాత రాంకా మాట్లాడుతూ.. "దేశంలోని రైతులు, విద్యార్థులు, యువత కలిసి నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని అన్ని వైపుల నుంచి చుట్టుముట్టాలని ఆశిస్తున్నాం" అని అన్నారు. ఇప్పుడు ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇకపై విద్యా సమస్యలతో పాటు రైతులు, యువత సమస్యల్ని కూడా ఉద్యమంలో భాగం చేయాలని సీజేపీ భావిస్తోన్నట్లు తెలుస్తోంది. విద్యార్థుల నిరసన సమయంలో కేంద్ర ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని సీజేపీ ఆరోపించింది. బీహార్, యూపీలలో విద్యార్థులపై కేసులు నమోదయ్యాయని పేర్కొంది. విద్యార్థులపై నమోదైన కేసుల్ని విత్ డ్రా చేసుకోవాలని టికాయత్ మద్దతు కోరినట్లు సీజేపీ తెలిపింది. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే రైతు సంఘాలు, యువజన సంఘాలతో కలిసి దేశవ్యాప్త ఉద్యమం చేపడుతామని హెచ్చరించింది.

# రాహుల్ వర్సెస్ కేంద్రం..

**న్యూ ఢిల్లీ :** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసన సందర్భంగా విద్యార్థులపై బలప్రయోగానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా అనుమతి ఇచ్చారని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. విద్యార్థులపై పోలీసుల చర్యలకు అమిత్ షానే బాధ్యుడని, ఇక్కడ చర్చ జరుగుతుంటే ఇవాళ లోక్ సభకు అమిత్ షా ఎందుకు రాలేదని ప్రశ్నించారు. యాంటీ పేపర్ లీక్ బిల్లుపై చర్చ సందర్భంగా ఇవాళ లోక్ సభలో మాట్లాడిన రాహుల్ గాంధీ.. దేశ విద్యావ్యవస్థను ఆర్ఎస్ఎస్ గుప్పిట్లో పెట్టుకుందని ధర్మేంద్ర ప్రధాన్ కేవలం సింబల్ మాత్రమేనన్నారు. ఆయన వెనక ఉన్నది ఆర్ఎస్ఎస్ అని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వాళ్లకే ప్రభుత్వంలో ప్రాధాన్యత ఉంటోందన్నారు. ఆఖరికి వర్సిటీల్లో కూడా ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వాళ్లనే నియమించారని ఆరోపించారు. విద్యకోసం విద్యార్థుల తల్లిదండ్రులు, లక్షలు ఖర్చుపెడుతున్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణత కోసం రాంత్రిబవళ్లు కష్టపడి చదువుతారు. విద్య కూడా వ్యాపారంగా మారితే విద్యార్థుల పరిస్థితి ఏంటని నిలదీశారు.

**బీజేపీ నేతలు మీ పిల్లలను అడగండి:**

విద్యార్థుల ఆందోళనను దేశ ప్రజలు అర్థం చేసుకున్నారని, ఢిల్లీ వీధుల్లో జరిగింది నిరసన కాదు, భావ వ్యక్తీకరణ అని రాహుల్ గాంధీ అన్నారు. పేపర్ లీక్‌పై ఏం జరిగిందో బీజేపీ ఎంపీలు వారి పిల్లలను అడగాలన్నారు. యువత సెంటిమెంట్‌ను అన్ని పార్టీలు గౌరవించాలని తీవ్ర వేదన తర్వాతే ఢిల్లీ వేదికగా విద్యార్థులు ఆందోళన చేశారన్నారు. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఉన్న విద్యార్థులు ఆందోళనకు గురయ్యారని, విద్యార్థుల ఆందోళనను బీజేపీ నేతల పిల్లలు సమర్థించారు కానీ విద్యార్థుల ఆందోళనను కేంద్రం అర్థం చేసుకోలేదని విమర్శఇంచారు. కేంద్రం మూర్ఖంగా వ్యవహరించిందని దుయ్యబట్టారు. విద్యారంగం ఇప్పుడు ఖరీదైన వ్యాపారంగా మారిందని దీంతో పేదలు విద్యకు దూరమవుతున్నారని అన్నారు.

**సభలో గందరగోళం:**

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని అతడు వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని అమిత్ షాకు క్షమాపణలు చెప్పాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ మైక్ కట్ చేయడంతో ఇందుకు నిరసనగా విపక్ష సభ్యులు సభలో నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సభలో గందరగోళం ఏర్పడింది. దీంతో స్పీకర్ ఓం బిర్లా సభను వాయిదా వేశారు.

# 'సర్' వేగవంతం చేయాలి



**ఢిల్లీ :** ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియను కాంగ్రెస్ బీఎల్ఏలు వేగవంతం చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎలక్షన్‌పై జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా పీసీసీలతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసి నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని సూచించారు. బీఎల్ఏలు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

**'సర్' ప్రక్రియ దురుద్దేశంతో జరుగుతుంది: మహేశ్ కుమార్ గౌడ్**

'సర్'పై రివ్యూ చేశామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. 36 వేల మంది బీఎల్ఏలను నియమించినట్లు చెప్పారు. 50 నుంచి 60 శాతం ఈ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో వందశాతం పూర్తవుతుందని వివరించారు. అర్హతగల ఓటర్ల ఓటు హక్కు కాపాడటం తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈసారి 'సర్' ప్రక్రియ దురుద్దేశంతో జరుగుతుందని చెప్పారు. ఓట్లను కాపాడే ఉద్దేశంతో ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. సంస్థాగత బలోపేతం, పార్టీ ప్రభుత్వ సమన్వయంపై మాట్లాడామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

**ఢిల్లీలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం..**

కాగా, ఢిల్లీ ఇందిరా భవన్‌లో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు (బుధవారం) జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , సీతక్క , సీడబ్ల్యూసీ సభ్యులు మంత్రి దామోదర్ రాజానర్సింహ, వంశీ చంద్ పాల్గొన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తెలంగాణలో 'సర్' ప్రక్రియ, పార్టీ - ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ కమిటీ పనితీరు, ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాల సమన్వయం, ప్రజలకు చేరువ చేసే కార్యాచరణపై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, సంస్థాగత బలోపేతం, రాజకీయ పరిస్థితులపై కూడా ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

# మన్మోహన్ సింగ్ కు క్లీన్ చిట్

**ఢిల్లీ :** బొగ్గు గనుల కేటాయింపు కేసులో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై ఉన్న క్రిమినల్ కేసును, ఆయనకు జారీ చేసిన సమన్ల ఉత్తర్వును దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు రద్దు చేసింది. ప్రత్యేక కోర్టు గతంలో జారీ చేసిన సమన్ల ఉత్తర్వులను కొట్టివేస్తూ కేసును శాశ్వతంగా క్లోజ్ చేసింది. చీఫ్ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌తో పాటు ఇతరులకు విచారణ సంస్థ క్లీన్ చిట్ ఇస్తూ సమర్పించిన క్లోజర్ నివేదికలను సుప్రీంకోర్టు ఆమోదించింది. సీబీఐ దాఖలు చేసిన క్లోజర్ రిపోర్టులను తోసిపుచ్చి, ట్రయల్ కోర్టు మన్మోహన్ సింగ్‌కు సమన్లు జారీ చేయాల్సిన అవసరం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.'విచారణ సంస్థల నివేదికల స్వీకరణపై ఈ కోర్టు గతంలో వెలువరించిన మార్గదర్శకాల ఆధారంగా చూస్తే, సీబీఐ అందించిన క్లోజర్ రిపోర్టులను తోసిపుచ్చి స్పెషల్ జడ్జి కేసును విచారణకు స్వీకరించడానికి ఎటువంటి బలమైన కారణం కనిపించడం లేదు. అందుకే మేము ఈ అప్పీల్‌ను అనుమతిస్తూ కేసును క్లోజ్ చేస్తున్నాం' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

**కేసు నేపథ్యం (2005 తలబిరా-II బొగ్గు గని కేటాయింపు)**

2005లో ఒడిశాలోని తలబిరా-II బొగ్గు బ్లాక్ కేటాయింపుల వ్యవహారంలో అక్రమాలు జరిగాయంటూ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, ప్రముఖ పారిశ్రామికవేత్త కుమార మంగళం బిర్లా, మాజీ బొగ్గు శాఖ కార్యదర్శి పి.సి. పరాఖ్‌లతో పాటు మరొక ముగ్గురిని నిందితులుగా పేర్కొంటూ నాటి ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది. అయితే, ఈ ఆదేశాలపై సుప్రీంకోర్టు వెంటనే జోక్యం చేసుకుని సమన్లపై స్టే విధించింది. ప్రధానమంత్రిగా, పబ్లిక్ సర్వెంట్‌గా నిర్ణయం తీసుకున్నందున చట్టపరమైన అనుమతి లేకుండా ప్రాసిక్యూట్ చేయడం సరికాదంది. కాగా, ఈ కేటాయింపుల ప్రక్రియలో ఎలాంటి నేరపూరిత ఉద్దేశం లేదని మన్మోహన్ సింగ్ ఆనాడే సుప్రీంకోర్టులో స్పష్టం చేశారు. ఇక, సుదీర్ఘ కాలం సాగిన ఈ విచారణలో సీబీఐ రెండుసార్లు దాఖలు చేసిన క్లోజర్ నివేదికలను ఆమోదిస్తూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పడంతో, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై ఉన్న ప్రధాన ఆరోపణలు తొలగిపోయినట్లయింది.



# తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు భారీ ఉపశమనం కల్పించింది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండంను సుప్రీంకోర్టు కొట్టివేసినా.. ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులన్నీ పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. ఈ తీర్పు భవిష్యత్తుకు మాత్రమే వర్తిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. దీంతో తెలంగాణలో కొనసాగుతున్న ఈ కీలక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి చట్టపరమైన ఆటంకం ఉండదని స్పష్టత వచ్చింది. అదే సమయంలో భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టులకు ముందస్తు పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని న్యాయస్థానం పేర్కొంది. కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా చట్టాలను భర్తీ చేయడం సాధ్యంకాదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాలంటే కేంద్రప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేయాల్సిందేనని సూచించింది. ఇప్పటికే పూర్తైన లేదా నిర్మాణంలో ఉన్న కీలక ప్రాజెక్ట్ పనులకు ఎలాంటి అంతరాయం ఉండదని న్యాయస్థానం పేర్కొనడంతో తెలంగాణ ప్రభుత్వం, సాగునీటి ప్రాజెక్టులకు ఇది కీలక ఊరటనిచ్చిన తీర్పుగా భావిస్తున్నారు.

# ఎల్-నినో ప్రభావాన్ని అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో ఎదుర్కోనాలి



**వలిగొండ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** కమిషనర్, పంచాయతీ రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు బుధవారం వలిగొండ మండల కేంద్రంలో ఎల్-నినో ప్రభావాలు, ముందస్తు సంసిద్ధత చర్యలు, వివిధ శాఖల సమన్వయం గ్రామస్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణపై మండల స్థాయి అవగాహన సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి జిల్లా ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎల్-నినో పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండి ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలకు ఎల్-నినో ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు తాగునీటి సంరక్షణ, నీటి వనరుల సమర్థ వినియోగం, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్య పరిరక్షణ, వ్యవసాయ రంగంలో అవసరమైన జాగ్రత్తలు తీసుకునేలా శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. మండల ప్రత్యేక అధికారి జగన్నాథ్ రావు మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీ ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి ఎల్-నినో ప్రభావాలను ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలని సూచించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీలు తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, నీటి వనరుల సంరక్షణ, ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎల్-నినో ప్రభావాలను దృష్టిలో ఉంచుకొని మండలంలో చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా తాగునీటి వనరుల పరిరక్షణ, నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవడం, గ్రామాల్లో నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించడం, చెరువులు, కుంటలు, బోర్‌వెల్స్, ఇతర నీటి వనరుల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. వ్యవసాయ రంగంలో రైతులు తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంపిక చేసుకోవడం, సూక్ష్మ సాగునీటి విధానాలను వినియోగించడం, పంటల సంరక్షణ చర్యలు చేపట్టడం, వ్యవసాయ శాఖ సూచనలను పాటించడం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని నిర్ణయించారు. అలాగే పశుసంవర్ధక శాఖ ద్వారా పశువులకు తాగునీరు, పశుగ్రాసం, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామపంచాయతీ స్థాయిలో గ్రామసభలు, అవగాహన ర్యాలీలు, మైకింగ్, కరపత్రాల పంపిణీ, గోడపత్రికలు ఇతర సమాచార మాధ్యమాల ద్వారా ఎల్-నినో ప్రభావాలు, నీటి సంరక్షణ, పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం, దోమల నివారణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. అదేవిధంగా పంచాయతీ రాజ్, రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, గృహనిర్మాణ, రోడ్లు-భవనాలు, పశుసంవర్ధక, పోలీస్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేలా గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రతి గ్రామంలో ముందస్తు చర్యలను సమర్థవంతంగా అమలు చేసి, ఎల్-నినో ప్రభావాలను తగ్గించే దిశగా అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తహసీల్దార్ దశరథ్ నాయక్, ఏపీఓ పరుశరాములు, ఏపీఎం అంజయ్య, వ్యవసాయ శాఖ అధికారి అంజలి, మండల వ్యవసాయ అధికారి అంజలి దేవి, పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి డా. ఎ. రవి, కె. ఉషా, నీటిపారుదల శాఖ సహాయ కార్యనిర్వహణ ఇంజనీర్ నాగరాజు, గాయత్రీ, విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్ నరసింహ, గృహనిర్మాణ శాఖ సహాయ ఇంజనీర్లు జి. కిరణ్, అశోక్, ఆర్ అండ్ బీ శాఖ సహాయ కార్యనిర్వహణ ఇంజనీర్ బాలరాజు, ఉద్యానవన శాఖ అధికారి కె. కవిత, ఎం.బి. గ్రిడ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. స్వాతి, పంచాయతీ రాజ్ శాఖ సహాయ ఇంజనీర్ జి. సందీప్ రెడ్డి, గ్రామీణ నీటి సరఫరా శాఖ సహాయ ఇంజనీర్ శ్రీకీర్తి, మండలంలోని గ్రామపంచాయతీ సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, మీడియా ప్రతినిదులు, సిబ్బంది పాల్గొన్నారు.




# జనం ఆలోచన మారాలి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 37 రోజుల పాటు చేపట్టిన సుదీర్ఘ నిరసన పోరాటాన్ని ముగించుకుని ఇంటికి తిరిగొచ్చినందుకు సంతోషంగా ఉందని, సాధారణ జీవితానికి తిరిగొచ్చి మనశ్శాంతిగా నిద్రపోవాలని భావిస్తున్నానని కాక్రోచ్ జనతా పార్టీ ఫౌండర్ అభిజీత్ దిప్కే కామెంట్ చేశారు. ఇవాళ ఆయన ఛత్రపతి శంభాజీ నగర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లు పై రియాక్ట్ అయ్యారు. దేశంలో ఎన్నో సంస్కరణలు వస్తున్నప్పటికీ ప్రజల ఉద్దే, ఆలోచన విధానంలో మార్పు రానంత వరకు వ్యవస్థలో ఎలాంటి మార్పు తేలేమని అన్నారు. పేపర్ లీకేజీల కేసులో ఏర్పాటు చేసిన ఫాస్ట్ ట్రాక్ కోర్టు మొదటి విచారణకు సీబీఐ కౌన్సెల్ హాజరుకాకపోవడం వల్ల వాయిదా పడటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేకపోతే రాబోయే రోజుల్లో అంతకంటే పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని అభిజీత్ దిప్కే హెచ్చరించారు.



# దేశంలో మారుతున్న విద్యా వ్యవస్థ..

భారతదేశ అభివృద్ధికి పునాది ఏమిటని ప్రశ్నిస్తే సహజంగానే "విద్య" అనే సమాధానం వస్తుంది. ఒక దేశం ఆర్థికంగా బలపడాలన్నా, సామాజికంగా సమానత్వాన్ని సాధించాలన్నా, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచంతో పోటీ పడాలన్నా నాణ్యమైన విద్య అనివార్యం. అందుకే విద్యను వ్యక్తిగత హక్కుగానే కాకుండా జాతీయ అభివృద్ధికి మూలస్తంభంగా ప్రపంచ దేశాలన్నీ పరిగణిస్తున్నాయి. అయితే భారతదేశంలో గత రెండు దశాబ్దాలుగా విద్యారంగంలో ఒక నిశ్శబ్దమైన కానీ అత్యంత ప్రభావవంతమైన మార్పు చోటుచేసుకుంటోంది. అది ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ పాఠశాలల వైపు విద్యార్థుల సంఖ్య క్రమంగా మళ్లడం. ఈ ధోరణి పట్టణాలకు మాత్రమే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ వేగంగా విస్తరిస్తోంది. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు సరిపోని పరిస్థితి ఉండగా, ఇప్పుడు అనేక ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల కొరతతో విలవిల్లాడుతున్నాయి. అదే సమయంలో చిన్న గ్రామాల్లో కూడా ప్రైవేట్ పాఠశాలలు పెరుగుతుండటం విద్యా వ్యవస్థలో ఏర్పడుతున్న మార్పుకు నిదర్శనం.ఈ మార్పును కేవలం తల్లిదండ్రుల వ్యక్తిగత ఎంపికగా చూడలేం. సమాజం, ఆర్థిక పరిస్థితులు, ఉద్యోగ అవకాశాలు, విద్యా విధానాలు, ప్రభుత్వ పాఠశాలల పనితీరు, ప్రైవేట్ రంగం విస్తరణ ఇవన్నీ కలిసి ఈ పరిస్థితికి కారణమయ్యాయి.

**ప్రభుత్వాలు ఉచిత విద్య, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, సైకిళ్లు, డిజిటల్ బోధన వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ, ప్రజల్లో నాణ్యమైన విద్యపై ఉన్న అంచనాలు మరింత పెరిగాయి. అందుకే ఎక్కువ ఖర్చు అయినా సరే పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులు భావిస్తున్నారు.ఈ మార్పు వెనుక మొదటి ప్రధాన కారణం నాణ్యమైన విద్యపై పెరిగిన అవగాహన. గతంలో చదువు అంటే పదో తరగతి లేదా ఇంటర్మీడియట్ వరకు పూర్తి చేయడమే ప్రధాన లక్ష్యంగా ఉండేది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. ప్రపంచీకరణ, సమాచార సాంకేతిక రంగం అభివృద్ధి, అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలు, విదేశీ విద్య వంటి అంశాలు తల్లిదండ్రుల ఆలోచనలను ప్రభావితం చేస్తున్నాయి.**

పిల్లలు చిన్నప్పటి నుంచే ఇంగ్లిష్‌లో నైపుణ్యం సాధించాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకోవాలని, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పునాది ఏర్పడాలని ప్రతి కుటుంబం కోరుకుంటోంది.ఇదే పరిస్థితిని ప్రైవేట్ పాఠశాలలు తమకు అనుకూలంగా మలచుకున్నాయి. ఇంగ్లిష్ మీడియం, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, డిజిటల్ బోధన, కంప్యూటర్ ల్యాబ్‌లు, రోబోటిక్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, అబాకస్, ఒలింపియాడ్ శిక్షణ, ఐఐటీ–నీట్ ఫౌండేషన్ వంటి కార్యక్రమాలను ఆకర్షణీయంగా ప్రచారం చేస్తున్నాయి. పిల్లల భవిష్యత్తుకు ఇవే అవసరమని తల్లిదండ్రులను నమ్మిస్తున్నాయి. ఫలితంగా ప్రైవేట్ పాఠశాలలపై విశ్వాసం పెరుగుతోంది.ఇక ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిని పరిశీలిస్తే రాష్ట్రానికో, జిల్లాకో, గ్రామానికో భిన్నంగా కనిపిస్తుంది. కొన్ని ప్రభుత్వ పాఠశాలలు అత్యాధునిక సదుపాయాలతో ఆదర్శంగా నిలుస్తుండగా, మరికొన్ని పాఠశాలలు కనీస మౌలిక వసతుల కోసం కూడా ఎదురుచూస్తున్నాయి. అనేక చోట్ల ఉపాధ్యాయుల ఖాళీలు భర్తీ కాకపోవడం, ఒకే ఉపాధ్యాయుడు బహుళ తరగతులకు బోధించడం, ప్రయోగశాలలు లేకపోవడం, క్రీడా మైదానాల కొరత, మరుగుదొడ్ల నిర్వహణలో సమస్యలు వంటి అంశాలు ప్రజల్లో ప్రతికూల అభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి. ప్రభుత్వాలు భారీగా నిధులు కేటాయిస్తున్నప్పటికీ వాటి ప్రభావం ప్రతి పాఠశాలలో సమానంగా కనిపించడం లేదు.ఇటీవలి సంవత్సరాల్లో పలు విద్యా సర్వేలు కూడా ఇదే ధోరణిని సూచిస్తున్నాయి. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పాఠశాలల గణాంకాలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు కొన్ని ప్రాంతాల్లో తగ్గుతుండగా, ప్రైవేట్ విద్యాసంస్థల్లో చేరికలు పెరుగుతున్నాయని వెల్లడిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇంగ్లిష్ మీడియం పట్ల ఆకర్షణ పెరిగినట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది ప్రభుత్వ విద్యపై పూర్తిగా అవిశ్వాసం కాదు; కానీ భవిష్యత్తు ఉద్యోగ అవకాశాలపై కుటుంబాల ఆందోళనకు ప్రతిబింబం.మరోవైపు విద్యారంగంలో మార్కెట్ ప్రభావం కూడా గణనీయంగా పెరిగింది. ఒకప్పుడు విద్య సేవగా భావించబడేది. ఇప్పుడు అది పెద్ద పరిశ్రమగా మారింది. కోట్ల రూపాయల పెట్టుబడులతో విద్యాసంస్థలు ఏర్పడుతున్నాయి. ప్రకటనలు, సోషల్ మీడియా ప్రచారం, ఆకర్షణీయమైన భవనాలు, ఎయిర్ కండిషన్డ్ తరగతి గదులు, ప్రత్యేక యూనిఫారాలు, అంతర్జాతీయ ప్రమాణాల పేర్లు---ఇవన్నీ విద్యా నాణ్యతకు ప్రతీకలుగా చూపబడుతున్నాయి. ఫలితంగా విద్య క్రమంగా వాణిజ్యీకరణ దిశగా సాగుతోందనే విమర్శలు బలపడుతున్నాయి.ప్రైవేట్ పాఠశాలలు అందిస్తున్న ప్రతి సేవ నాణ్యమైనదే అని చెప్పడం కూడా సరైంది కాదు. కొన్ని ప్రముఖ సంస్థలు ఉన్నత ప్రమాణాలు పాటిస్తున్నప్పటికీ, అనేక చిన్న ప్రైవేట్ పాఠశాలలు సరైన శిక్షణ పొందిన ఉపాధ్యాయులు లేకుండానే నడుస్తున్నాయి. అయినప్పటికీ ప్రజలు వాటినే ఎంచుకోవడానికి ప్రధాన కారణం "ప్రభుత్వ పాఠశాల కంటే ఇది మెరుగ్గా ఉంటుంది" అనే భావన. అంటే సమస్య కేవలం ప్రైవేట్ విద్య బలం కాదు; ప్రభుత్వ విద్యపై ప్రజల నమ్మకం తగ్గడం కూడా.తల్లిదండ్రుల మనస్తత్వంలో వచ్చిన మార్పు కూడా దీనికి కారణమే. ఒకప్పుడు ఇంటికి దగ్గరగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించడం సహజం. ఇప్పుడు చాలామంది ఉదయం గంటల ప్రయాణం అయినా, ఎక్కువ ఫీజు అయినా, ప్రైవేట్ పాఠశాలనే ఎంచుకుంటున్నారు. పిల్లల విద్యపై ఖర్చును పెట్టుబడిగా భావిస్తున్నారు. కుటుంబ ఆదాయంలో పెద్ద భాగాన్ని విద్యకే వెచ్చిస్తున్నారు. కొందరు అప్పులు చేసి, ఆభరణాలు తాకట్టు పెట్టి కూడా ప్రైవేట్ విద్యను ఎంచుకుంటున్నారు. ఇది ఒకవైపు విద్యపై పెరిగిన చైతన్యానికి సంకేతం అయితే, మరోవైపు ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ఏర్పడిన సందేహాలకు నిదర్శనం.ఇంగ్లిష్ మీడియం ప్రభావం కూడా నిర్లక్ష్యం చేయలేని అంశం. ప్రపంచీకరణ నేపథ్యంలో ఇంగ్లిష్ భాషకు ప్రాధాన్యం పెరగడం సహజం. ఉద్యోగాలు, ఉన్నత విద్య, సాంకేతిక రంగం, విదేశీ అవకాశాలు---ప్రతి రంగంలో ఇంగ్లిష్ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు కూడా అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టాయి. అయినప్పటికీ కేవలం బోధనా మాధ్యమం మార్చడం వల్లనే సమస్య పరిష్కారం కాలేదు. ఉపాధ్యాయుల శిక్షణ, పాఠ్యపద్ధతులు, భాషా బోధన నాణ్యత, విద్యార్థుల అభ్యాస సామర్థ్యం వంటి అంశాల్లో సమగ్ర మార్పులు అవసరమయ్యాయి.ఇక్కడ మరో అంశాన్ని గుర్తించాలి. విద్య అంటే కేవలం పరీక్షల్లో మార్కులు సాధించడం కాదు. సృజనాత్మకత, విలువలు, సామాజిక బాధ్యత, శాస్త్రీయ దృక్పథం, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, మానవీయ విలువలు కూడా విద్యలో భాగమే. అయితే నేటి పోటీ ప్రపంచంలో ఎక్కువ పాఠశాలలు మార్కులు, ర్యాంకులు, ప్రవేశ పరీక్షలకే ప్రాధాన్యం ఇస్తున్నాయి. పిల్లలపై చిన్న వయస్సులోనే ఒత్తిడి పెరుగుతోంది. ప్రైవేట్ పాఠశాలల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు సుదీర్ఘ బోధన, ప్రత్యేక తరగతులు, పరీక్షలతో విద్యార్థుల బాల్యం క్రమంగా పోటీకి బలి అవుతోందనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.ఇటీవలి కాలంలో ప్రభుత్వాలు పాఠశాలల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టాయి. భవనాల మరమ్మతులు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, డిజిటల్ బోధన, పాఠశాలల విలీనం, నూతన పాఠ్యాంశాలు, నైపుణ్యాధారిత బోధన వంటి చర్యలు ప్రారంభమయ్యాయి. కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా మారుతున్నాయి. గ్రామాల్లోనూ ఆధునిక వసతులు అందుబాటులోకి వస్తున్నాయి. అయినప్పటికీ ఈ మార్పులు దేశవ్యాప్తంగా సమానంగా అమలు కావడం లేదు. అందువల్ల ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా తిరిగి పొందాలంటే మరింత సమగ్ర సంస్కరణలు అవసరం.దేశంలో విద్యా వ్యవస్థ ప్రస్తుతం ఒక కీలక మలుపు వద్ద నిలిచింది. ఒకవైపు ప్రైవేట్ రంగం విస్తరిస్తుంటే, మరోవైపు ప్రభుత్వ పాఠశాలలు తమ ప్రాధాన్యాన్ని నిలబెట్టుకునేందుకు కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఈ పోటీ చివరికి విద్యార్థుల ప్రయోజనాలకు దోహదపడితేనే అది సానుకూల పరిణామం అవుతుంది. లేదంటే విద్య ధనికులకు మాత్రమే అందుబాటులో ఉండే వస్తువుగా మారే ప్రమాదం ఉంది.దేశంలో విద్యా రంగంలో జరుగుతున్న మార్పులను పరిశీలిస్తే, అవి కేవలం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల మధ్య పోటీగా మాత్రమే కనిపించవు. అవి సమాజంలో మారుతున్న ఆర్థిక పరిస్థితులు, తల్లిదండ్రుల ఆలోచనా విధానం, ఉద్యోగ విపణిలో పెరుగుతున్న పోటీ, సాంకేతిక విప్లవం, ప్రపంచీకరణ వంటి అనేక అంశాల సమ్మిళిత ప్రభావంగా చూడాలి. అందుకే ప్రైవేట్ పాఠశాలల వైపు విద్యార్థుల మొగ్గును విమర్శించడం లేదా ప్రభుత్వ పాఠశాలల వైఫల్యంగా మాత్రమే చిత్రీకరించడం సరైన విశ్లేషణ కాదు. ప్రజలు ఏ కారణాలతో తమ పిల్లలకు ప్రైవేట్ విద్యను ఎంచుకుంటున్నారో అర్థం చేసుకుని, ప్రభుత్వ విద్యను అదే స్థాయిలో బలోపేతం చేయడమే దీర్ఘకాలిక పరిష్కారం.ఈ నేపథ్యంలో జాతీయ విద్యా విధానం--2020 దేశ విద్యా రంగానికి కొత్త దిశానిర్దేశం చేసింది. ఈ విధానం కేవలం పాఠ్యాంశాల మార్పులకే పరిమితం కాకుండా, విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధి, సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, అనుభవాధారిత అభ్యాసం, వృత్తి విద్య, డిజిటల్ విద్య వంటి అంశాలకు పెద్దపీట వేసింది. మూడు నుంచి ఎనిమిదేళ్ల వయస్సు వరకు బాల్య విద్యకు ప్రాధాన్యం ఇవ్వడం, 5о3о3о4 విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడం, మాతృభాషలో బోధనను ప్రోత్సహించడం వంటి నిర్ణయాలు విద్యా రంగంలో కొత్త మార్పులకు నాంది పలికాయి.అయితే ఏ విద్యా విధానమైనా దాని విజయం అమలుపైనే ఆధారపడి ఉంటుంది. పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులు లేకపోతే, ప్రయోగశాలలు లేకపోతే, డిజిటల్ పరికరాలు అందుబాటులో లేకపోతే, విధానాలు కేవలం పత్రాలకే పరిమితమవుతాయి. అందువల్ల ప్రభుత్వాలు విద్యపై ఖర్చును పెంచడంతో పాటు, ఆ నిధుల వినియోగంలో పారదర్శకతను కూడా నిర్ధారించాలి.ప్రభుత్వ పాఠశాలల బలాన్ని కూడా విస్మరించలేం. దేశంలోని కోట్లాది మంది విద్యార్థులకు ఇప్పటికీ ప్రభుత్వ విద్యాసంస్థలే ప్రధాన ఆధారం. గ్రామీణ ప్రాంతాల్లో, గిరిజన ప్రాంతాల్లో, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు విద్య అందిస్తున్నది ప్రభుత్వ వ్యవస్థే. భారతదేశంలో అత్యున్నత పదవులు అలంకరించిన అనేక మంది అధికారులు, శాస్త్రవేత్తలు, వైద్యులు, న్యాయమూర్తులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నారు. అంటే ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యను అందించలేవు అనడం వాస్తవానికి దూరం. సమస్య కొన్ని ప్రాంతాల్లో నాణ్యతలో వచ్చిన అసమానత.ప్రైవేట్ పాఠశాలల బలం ప్రధానంగా నిర్వహణలో కనిపిస్తుంది. విద్యార్థుల హాజరుపై పర్యవేక్షణ, ఉపాధ్యాయుల బాధ్యత, తల్లిదండ్రులతో నిరంతర సంబంధాలు, సాంకేతిక వినియోగం, ఫలితాలపై దృష్టి వంటి అంశాల్లో అవి ముందంజలో ఉంటాయి. ఈ పద్ధతుల్లోని మంచి అంశాలను ప్రభుత్వ పాఠశాలలు కూడా స్వీకరించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ వ్యవస్థలో కూడా జవాబుదారీతనం పెరిగితే ప్రజల విశ్వాసం తిరిగి బలపడుతుంది.అయితే ప్రైవేట్ విద్య విస్తరణతో పాటు మరో ఆందోళనకర అంశం వెలుగులోకి వచ్చింది. అదే విద్య వాణిజ్యీకరణ. విద్య అనేది సేవా రంగం నుంచి వ్యాపార రంగంగా మారుతోందనే విమర్శలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కొన్ని విద్యాసంస్థలు ప్రతి సంవత్సరం భారీగా ఫీజులు పెంచడం, పుస్తకాలు, యూనిఫారాలు, రవాణా, ప్రత్యేక తరగతులు, కార్యాచరణల పేరుతో అదనపు రుసుములు వసూలు చేయడం వల్ల మధ్యతరగతి కుటుంబాలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతోంది. పిల్లల చదువు కోసం కుటుంబాలు అప్పులు చేయాల్సిన పరిస్థితి రావడం ఆరోగ్యకరమైన విద్యా వ్యవస్థకు సంకేతం కాదు.మరోవైపు విద్యార్థులపై మానసిక ఒత్తిడి కూడా పెరుగుతోంది. మార్కులు, ర్యాంకులు, పోటీ పరీక్షలు, ఒలింపియాడ్లు, ప్రవేశ పరీక్షలు అనే పేర్లతో చిన్న వయస్సులోనే తీవ్రమైన పోటీ వాతావరణం సృష్టించబడుతోంది. ఆటలు, కళలు, సాహిత్యం, సామాజిక అవగాహన వంటి అంశాలకు తగిన ప్రాధాన్యం లభించడం లేదు. విద్యార్థి వ్యక్తిత్వ వికాసం కంటే మార్కులే విజయానికి ప్రమాణంగా మారడం ఆందోళన కలిగించే విషయం.తెలుగు రాష్ట్రాల పరిస్థితిని పరిశీలించినా ఇదే ధోరణి కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టాయి. భవనాల అభివృద్ధి, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, ఇంగ్లిష్ మీడియం, పాఠశాలల మౌలిక వసతుల మెరుగుదల, విద్యార్థులకు ఉచిత సౌకర్యాలు వంటి చర్యలు అమలవుతున్నాయి. అయినప్పటికీ పట్టణ ప్రాంతాల్లో ప్రైవేట్ పాఠశాలలపై ఆకర్షణ తగ్గలేదు. కారణం, నాణ్యమైన విద్యతో పాటు ఇంగ్లిష్ కమ్యూనికేషన్, పోటీ పరీక్షల శిక్షణ, సాంకేతిక నైపుణ్యాలపై తల్లిదండ్రుల అంచనాలు మరింత పెరగడమే.ఇక గ్రామీణ--పట్టణ విద్య మధ్య వ్యత్యాసం కూడా గమనించాల్సిన అంశం. నగరాల్లో ఆధునిక సదుపాయాలు, నిపుణులైన ఉపాధ్యాయులు, సాంకేతిక వనరులు ఎక్కువగా అందుబాటులో ఉంటే, గ్రామాల్లో ఇప్పటికీ ఉపాధ్యాయుల కొరత, డిజిటల్ సదుపాయాల లేమి, రవాణా సమస్యలు కనిపిస్తున్నాయి. ఈ అసమానతను తొలగించకుండా దేశవ్యాప్తంగా సమాన విద్యను అందించడం సాధ్యం కాదు.ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలు స్పష్టంగా ఉన్నాయి. మొదటగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తగిన సంఖ్యలో ఉపాధ్యాయులను నియమించాలి. ఖాళీలను సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచడం విద్యా నాణ్యతను దెబ్బతీస్తుంది. రెండవది, ఉపాధ్యాయులకు ఆధునిక బోధనా పద్ధతులపై నిరంతర శిక్షణ ఇవ్వాలి. మూడవది, డిజిటల్ విద్యను కేవలం నగరాలకే పరిమితం చేయకుండా గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరించాలి. నాలుగవది, విద్యార్థుల అభ్యాస ఫలితాలను క్రమం తప్పకుండా అంచనా వేసి, బలహీనతలను సరిదిద్దే చర్యలు తీసుకోవాలి.అదే సమయంలో ప్రైవేట్ పాఠశాలలపై కూడా సమర్థవంతమైన నియంత్రణ అవసరం. ఫీజుల పెంపు, పారదర్శకత, ఉపాధ్యాయుల అర్హతలు, మౌలిక వసతులు, విద్యా ప్రమాణాల విషయంలో స్పష్టమైన నిబంధనలు అమలు చేయాలి. మంచి సేవలు అందించే ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహిస్తూ, విద్యను కేవలం లాభార్జన సాధనంగా మార్చే ధోరణిని అరికట్టాలి.తల్లిదండ్రుల పాత్ర కూడా అత్యంత కీలకం. పాఠశాల ఎంపికలో కేవలం ప్రకటనలు, భవనాల ఆడంబరాలు, ఫలితాల శాతాన్ని మాత్రమే ప్రమాణంగా తీసుకోవడం సరికాదు. ఉపాధ్యాయుల నాణ్యత, విద్యార్థి వ్యక్తిత్వ వికాసం, విలువల బోధన, భాషా సామర్థ్యం, సృజనాత్మకత, క్రీడలు, కళలు వంటి అంశాలను కూడా సమానంగా పరిగణించాలి. పిల్లలను ఇతరులతో పోల్చడం కంటే వారి ఆసక్తులు, సామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహించడం ముఖ్యం.సమాజం కూడా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగస్వామి కావాలి. పూర్వ విద్యార్థులు, స్థానిక సంస్థలు, పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకోవడం, గ్రంథాలయాలు, డిజిటల్ ల్యాబ్‌లు, క్రీడా సామగ్రి అందించడం వంటి కార్యక్రమాలు చేపడితే గణనీయమైన మార్పు సాధ్యమవుతుంది. విద్యను ప్రభుత్వ బాధ్యతగా మాత్రమే కాకుండా సామాజిక బాధ్యతగా కూడా చూడాల్సిన సమయం ఆసన్నమైంది.ప్రపంచంలో అత్యుత్తమ విద్యా వ్యవస్థలను కలిగిన దేశాలను పరిశీలిస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. అక్కడ ప్రభుత్వ పాఠశాలలే నాణ్యతకు ప్రతీకగా నిలుస్తాయి. సంపన్నులు, సామాన్యులు ఒకే ప్రభుత్వ పాఠశాలలో చదివే పరిస్థితి ఉంటుంది. విద్యలో సమానత్వమే ఆ దేశాల అభివృద్ధికి మూలకారణం. భారతదేశం కూడా అదే దిశగా అడుగులు వేయాలి. ప్రభుత్వ విద్య బలపడితేనే సామాజిక న్యాయం బలపడుతుంది. ప్రతి కుటుంబం తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి గర్వపడే పరిస్థితి ఏర్పడినప్పుడే నిజమైన విద్యా సంస్కరణలు ఫలించినట్లవుతుంది.మొత్తానికి, ప్రైవేట్ పాఠశాలల వైపు విద్యార్థుల మొగ్గు పెరగడం ఒక సామాజిక వాస్తవం. దీనిని అడ్డుకోవడం కాదు, దానికి కారణమైన లోపాలను సరిదిద్దడమే ప్రభుత్వాల ముందున్న అసలైన సవాలు. ప్రభుత్వ, ప్రైవేట్ అనే విభజన కంటే విద్యార్థికి నాణ్యమైన విద్య అందుతోందా లేదా అన్నదే ప్రధాన ప్రమాణం కావాలి. ప్రతి చిన్నారికి ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా ఉత్తమ విద్య అందేలా వ్యవస్థను తీర్చిదిద్దినప్పుడే రాజ్యాంగం కల్పించిన సమాన అవకాశాల లక్ష్యం సాకారమవుతుంది.విద్య ఒక దేశ భవిష్యత్తును నిర్మించే శక్తి. ఆ శక్తి కొద్దిమందికే పరిమితం కాకుండా ప్రతి చిన్నారికి అందుబాటులో ఉండాలి. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలి, ప్రైవేట్ పాఠశాలలు నాణ్యతను పెంపొందించాలి, తల్లిదండ్రులు చైతన్యవంతులుగా వ్యవహరించాలి, ప్రభుత్వాలు దీర్ఘకాలిక సంస్కరణలను అమలు చేయాలి. ఈ నాలుగు అంశాలు సమన్వయంతో ముందుకు సాగినప్పుడే భారతదేశ విద్యా వ్యవస్థ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుంది. అదే "వికసిత భారత్" నిర్మాణానికి బలమైన పునాది అవుతుంది.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు?

**నిజామాబాద్,ఫ్లాష్ ఇండియా :** పేద కుటుంబాలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యం కొంత మేర బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోందన్న ఆరోపణలు జిల్లాలో వినిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రేషన్ డీలర్లే లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని నేరుగా కొనుగోలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తవ-ంవుతున్నాయి. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. కరోనా కాలం నుంచి ప్రభుత్వం పేద కుటుంబాలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో వ్యక్తికి నెలకు ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తోంది. గతంలో రేషన్ దుకాణాల ద్వారా దొడ్డు బియ్యం పంపిణీ జరిగేది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సన్నబియ్యం పంపిణీ ప్రారంభమవడంతో రాష్ట్రంలో సన్నాల సాగు కూడా పెరిగిందని అధికారులు చెబుతున్నారు.గతంలో దొడ్డు బియ్యం తీసుకున్న పలువురు లబ్ధిదారులు దానిని దళారులకు విక్రయించేవారు. రేషన్ పంపిణీ రోజుల్లో గ్రామాలు, కాలనీల్లో తిరుగుతూ దళారులు బియ్యం కొనుగోలు చేసేవారని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం సన్నబియ్యం సరఫరా అవుతున్నప్పటికీ, కొంతమంది లబ్ధిదారులు ఇప్పటికీ తమకు వచ్చిన బియ్యాన్ని విక్రయిస్తున్నారని సమాచారం.

**డీలర్లే కొనుగోలు చేస్తున్నారనే విమర్శలు**

కొన్ని ప్రాంతాల్లో రేషన్ డీలర్లే లబ్ధిదారుల నుంచి కిలోకు రూ.16 నుంచి రూ.20 వరకు చెల్లించి బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రేషన్ దుకాణాల్లోనే ఈ కొనుగోళ్లు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేయడం, విక్రయించడం ప్రజాపంపిణీ వ్యవస్థ నిబంధనలకు విరుద్ధమని తెలిసినా ఈ వ్యవహారం కొనసాగుతోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రభుత్వ లక్ష్యం దెబ్బతింటోందా?**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సహకారంతో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా జిల్లాలో సుమారు 4.5 లక్షల నుంచి 5 లక్షల మంది లబ్ధిదారులకు ప్రతి నెల వేల టన్నుల సన్నబియ్యం ఉచితంగా పంపిణీ అవుతోంది. అయితే ఇందులో కొంత భాగం అక్రమంగా మార్కెట్‌కు మళ్లిపోతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజమైన లబ్ధిదారుల కోసం ఉద్దేశించిన సంక్షేమ పథకం లక్ష్యం దెబ్బతింటోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.నిజామాబాద్ నగరంలోని గాయత్రినగర్, గంగస్థాన్, కంఠేశ్వర్, దుబ్బ, వినాయక్‌నగర్ తదితర ప్రాంతాల్లోని కొన్ని రేషన్ దుకాణాల్లో ఈ తరహా కొనుగోళ్లు జరుగుతున్నాయనే సమాచారం ఉంది. ఈ ఆరోపణలపై పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# భారీ వర్షాన్నీ లెక్కచేయని భక్తి..

**కొండగట్టు,ఫ్లాష్ ఇండియా :** గురు పౌర్ణమి సందర్భంగా కొండగట్టు శ్రీ ఆంజనేయ-స్వామి సన్నిధిలో నిర్వహించిన గిరిప్రదక్షిణ భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురు-స్తున్నప్పటికీ భక్తుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వేలాది మంది భక్తులు గిరిప్రదక్షిణలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, జలాశయాలు నిండిపోవడంతో పాటు రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా గిరిప్రదక్షిణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌తో పాటు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గిరిప్రదక్షిణ అనంతరం శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రజాప్రతినిధులు రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలతో పాటు వ్యవసాయం అభివృద్ధి చెందాలని, ప్రతి రైతు ఆనందంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. భారీ వర్షం మధ్య కూడా ప్రజాప్రతినిధులు భక్తులతో కలిసి కాలినడకన గిరిప్రదక్షిణ పూర్తి చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గురు పౌర్ణమి సందర్భంగా కొండగట్టు క్షేత్రానికి తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. తాగునీరు, వైద్య సేవలు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ వంటి ఏర్పాట్లను పటిష్టంగా అమలు చేయడంతో కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది. భారీ వర్షం మధ్య జరిగిన ఈ గిరిప్రదక్షిణ భక్తి, విశ్వాసం, రాష్ట్ర సుభిక్షం కోసం చేసిన సామూహిక ప్రా-ర్థనగా నిలిచింది.

# మాకు దురుద్దేశం లేదు

## కాళేశ్వరంపై కేటీఆర్ మాట్లాడటం సిగ్గుచేటు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడటం సిగ్గుచేటని నీటిపా-రుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రా-జెక్టును సరిగా కట్టి ఉంటే ఇప్పుడు ఈ సమస్య వచ్చి ఉండేదే కాదన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన అక్కడ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఎన్డీఎస్ఏ నివేదిక మేరకే కాళేశ్వరం విషయంతో తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలకు నీళ్లు ఇచ్చేందుకు అన్ని ప్రయత్నాలు చే స్తున్నామని, ఈ నెల 31న ఢిల్లీలో ఎన్డీఎస్ఏ సమావేశానికి పిలిచిందని తెలంగాణ ప్రభుత్వంతో పాటు సీడబ్ల్యూసీని కూడా పిలిచిందన్నారు. ఈ సమావేశంలో కాళేశ్వరంపై సమీక్ష చేసి ఎలా ముందుకు వెళ్లాలనేది నిర్ణయం తీసుకుంటామన్నారు.

**మాకు దురుద్దేశం లేదు:**

మాకు ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని, పద్ధతి ప్రకారమే ముందుకు వె ళ్తున్నామన్నారు. కాళేశ్వరం బ్యారేజీలు కేసీఆర్ హయాంలో నిర్మించడం వారి హ-యంలోనే కూలిపోయాయన్నారు. ఎన్డీఎస్ఏ వచ్చి ఈ మూడు బ్యారేజీ గేట్లు తెరిచి ఉంచాలనే ఆదేశాలు ఇచ్చిందన్నారు. నాణ్యతా లోపాలతో బీఆర్ఎస్ కాళేశ్వరంను నిర్మించిందన్నారు. ఎలా పడితే అలా మాట్లాడటానికి కేటీఆర్ సిగ్గుపడాలన్నారు.

# 2.31 లక్షల ఎకరాలు మాయం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో భూములు మాయమయ్యాయి. రికార్డులు ట్యాంపరింగ్ చేశారు. రాత్రికి రాత్రే మార్చే-సుకున్నారు. ఇది ఇప్పటికే 3 కమిటీలు నిగ్గు తేల్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ధరణి కమిటీ తేల్చి చెప్పింది. ఆ తర్వాత ఫోరెన్సిక్ ఆడిట్ స్పష్టం చేసింది. నిన్న మొన్నటి అధికారుల కమిటీ కూడా లెక్క తేల్చింది. గతంలోనే అక్రమాలు, అవినీతి, ఇల్లీగల్ ట్రాన్సాక్షన్స్, నాలా కన్వర్షన్లు, క్లాసిఫికేషన్ చేంజ్, పేరు మార్పిడి వంటి అనేక అంశాలు బయటికొచ్చాయి. ఇప్పుడు కొత్తగా వేసే స్పెషల్ ఎంక్వయిరీ కమిటీ(సెట్) ఏం చేస్తుందన్న ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే 3 నివేదికల మీద ఎలాంటి యాక్షన్ తీసుకున్నారో ప్రభుత్వం క్లారిటీ ఇవ్వలేదు. కానీ ఇప్పుడు నాలుగో కమిటీ వేయడం విమర్శలకు తావిస్తోంది. అక్రమాలకు ఆధారాలు దొరికాయని మంత్రులు, అధికారులు ప్రకటించినప్పుడు చట్టపరంగా చర్యలు తీసుకోకుండా తాత్సారం చేయడం ఎందుకన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.బీఆర్ఎస్ పాలనలో పదేండ్లు, ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో రెండున్నరేండ్లల్లో ఎంత భూమిని చెర పట్టారన్నది లెక్కలతోనే స్పష్టమవుతుంది. అలాంటప్పుడు కమిటీలతో కాలయాపన చేయడం వల్ల ఉపయోగం ఏమిటన్న చర్చ అధికార వర్గాల్లోనే జరుగుతున్నది. తాజాగా ఐపీఎస్, ఐఏఎస్ అధికారులతో 'సెట్' వే-స్తున్నారు. వీళ్లు కూడా పాత కమిటీలు తేల్చిందే తప్ప కొత్తగా ఒరిగేదేం ఉందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమా-ర్కులపై నిజంగానే యాక్షన్ తీసుకోవాలనుకుంటే 'కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ యాక్ట్, 1952' ప్రకారం కమిషన్‌ని ఏర్పాటు చేయాలని నిపుణులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే 'సెట్' ఇచ్చే రిపోర్ట్‌కి చట్టబద్ధత ఉండదంటున్నారు.

**అప్పుడు.. ఇప్పుడు**

బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ప్రభుత్వ భూములను చెరబట్టారు. ఎన్వోసీలు, ఓఆర్సీల ద్వారా సొంతం చేసుకున్నారు. సర్కారీ నుంచి పట్టా భూములుగా మార్చేశ-ారు. రాష్ట్ర వ్యాప్తంగా లెక్కలేనన్ని భూములు రాజకీయ నాయకులు, వారి కంపెనీల వశమయ్యాయి. ఒక్కో పొలిటీషియన్ రూ.వందల కోట్లకు ఎదిగారు. ఈ క్రమంలోనే భూ వివాదాలూ లక్షల్లోనే దర్శనమిచ్చాయి. ఐతే ప్రభుత్వ భూమినీ కొట్టేశారని రికార్డులు చెబుతున్నాయి. 2014లో తెలంగాణ ఆవిర్భావం తర్వాత నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందించేందుకు కసరత్తు జరిగింది. అప్పుడే పారిశ్రామిక వాడలు నెలకొల్పేందుకు భూముల డేటాను తెప్పించుకున్నారు. సాగుకు పనికి రాని ప్రభుత్వ భూమిలోనే పరిశ్రమలు ఉండాలని తొలుత భావించారు. అప్పుడు తేల్చిన లెక్కల్లో 17.78 లక్షల ఎకరాలు సాగుకు పనికి రాని ప్రభుత్వ భూమి ఉందని గుర్తించారు.ఆ పదేండ్ల కాలంలో ఏర్పాటైన ఇండస్ట్రియల్ పార్కుల కోసం సర్కారు భూముల కంటే పట్టా భూములనే అత్యధికం వినియోగించారు. దాంతో ఇప్పటి లెక్కల్లో ప్రభుత్వ భూమి మొత్తం(సాగుకు పనికొచ్చేది, సాగుకు పనికి రానిది కలిపి) 15.46 లక్షలు మాత్రమే. సాగుకు పనికి రాని భూమితో సరిపోలిస్తే ఏకంగా 2.31 లక్షల ఎకరాల భూమి కనిపించడం లేదు. సాగుకు పనికి రాని గుట్టల స్వాహా పర్వం లెక్కలు తీస్తే ఎన్ని లక్షల ఎకరాలు పెద్దలు ఎత్తుకెళ్లారో తెలుస్తుంది. అప్పుడు ధరణి, ఇప్పుడు భూ భారతితోనూ దందా నడు-స్తూనే ఉంది. ఈ రెండున్నరేండ్ల లెక్క కూడా తేల్చితే ఎంత అనేది బయటపడుతుంది.

**తీసిన లెక్కలే మళ్లీ..**

ధరణి పోర్టల్‌ని అడ్డం పెట్టుకొని అడ్డగోలుగా భూ కబ్జాలు చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం పలుమార్లు ప్రకటించింది. గతంలో నిషేధిత జాబితాలోని 20 ఎకరాల ఖరీదైన భూమిని మాజీ సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యుడు సంతోష్ రావు పట్టా చేయించుకున్నారని ధరణి కమిటీ సభ్యుడు ఎం.కోదండరెడ్డి ఆరోపించారు. అలాంటి లీడర్లు అనేక మంది ఉన్నారని ప్రకటించారు. నాడు మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారు సైతం భూదందాల్లో ఉన్నట్లు స్పష్టం చేశారు. అలాగే పీవోబీ జాబితాలో స్పష్టంగా ఉ న్నప్పటికీ క్రయ విక్రయాలు సాగించిన భూములు ఉన్నాయి. గండిపేట, శేరిలింగంపల్లి.. ఈ రెండు మండలాల్లోనే రూ.వేల కోట్ల అవినీతి జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. రాత్రికి రాత్రే ట్రాన్సాక్షన్స్ పూర్తయ్యాయని ప్రభుత్వమే బయట పెట్టింది. మరి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనేది ప్రశ్నార్థకంగా మారింది.

**పదేండ్లల్లో తేడా ఇలా..**

**2014లో సాగుకు పనికి రాని ప్రభుత్వ భూమి : 17,78,026**

**2024లో మిగిలిన ప్రభుత్వ భూమి : 15,46,975**

**పదేండ్లల్లో మాయమైన భూమి : 2,31,051**

ఇక ఈ రెండున్నరేండ్లల్లో ఎంత మాయ-ంమైందో ఫోరెన్సిక్ ఆడిట్, ఐఏఎస్‌ల కమిటీ లెక్కలు తేల్చింది. ఇప్పుడు స్పెషల్ ఎంక్వయిరీ టీమ్(సెట్) కూడా పరిశీలిస్తోంది.

**ఎన్వోసీల లెక్క తేల్చాలి**


రాష్ట్రంలో ధరణి పోర్టల్ ద్వారా అనేక అక్రమాలు జరిగాయి. వీటిలో ప్రభుత్వ భూములకు ఎన్వోసీలు, పాస్ పుస్తకాల జారీ, భూ కేటాయింపులు ఉన్నాయి. అక్రమంగా పొందిన ఎన్వోసీలను రద్దు చేసి ల్యాండ్ రెవెన్యూ యాక్ట్ సెక్షన్ 166-బీ ప్రకారం తిరిగి ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి సూచించాయి. లెక్కలేనన్ని ఖాళీ స్థలాలను జీవో 59 కింద నామమా-త్రపు రేట్లకే రెగ్యులరైజ్ చేశారని, వాటిపైనా దర్యాప్తు చేయించాలన్నారు. ఇల్లీగల్‌గా జారీ చేసిన ఎన్వోసీలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఆ స్థలాలను హస్తగతం చేసుకున్నదంతా సంపన్న వర్గాలే.. రాజకీయ వర్గాలతో సత్సంబంధాలు కలిగిన వారే. వారి బినామీ కంపెనీలేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో అక్రమార్కులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటుందా? స ర్దుకుపోతారా? ఏం నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

# ట్రైనీ ఐపీఎస్ అరెస్ట్..

## మహిళా ట్రైనీ ఐపీఎస్‌కు వైద్య పరీక్షలు!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారి ఇచ్చిన లైంగిక వేధింపులు, దాడి కేసులో ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం సాయంత్రం తన స్వగ్రామం నుంచి హైదరాబాద్‌కు వస్తుండగా.. నల్గొండ జిల్లా మిర్యాలగూడ సమీపంలోని దామరచర్ల వద్ద పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. మరికొద్ది సేపట్లో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిని కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలుస్తోంది.ఈ నెల 18న మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారి అత్తాపూర్ పోలీస్ స్టేష-న్‌లో ఉదయ్ కృష్ణారెడ్డిపై ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చే శారు. కేసు నమోదైన రెండు రోజుల తర్వాత.. ఈ నెల 20న ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అనంతరం ఎస్ఆర్ నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నాలుగు రోజుల పాటు చికిత్స పొందారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత ఆయన కనిపించకుండా పోవడంతో పోలీసులు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో నిన్న తన స్వగ్రామంలో ఉదయ్ కృష్ణారెడ్డి కనిపించారు.తాను ఎక్కడికీ పారిపోలేదని, తన నాయనమ్మ ఆరోగ్యం బాగోలేకపోవడంతో సొంతూరుకు వచ్చానని ఉదయ్ కృష్ణారెడ్డి మీడియాతో చెప్పారు. విచారణ అధికారులకు పూర్తిగా సహకరిస్తానని, న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉందని వెల్లడించారు. తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని, తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటా అని చెప్పారు. హైదరాబాద్‌కు వస్తున్న సమ-యంలో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకుని అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దర్యాప్తులో భాగంగా ఉదయ్ కృష్ణారెడ్డి వాంగ్మూలాన్ని అధికారులు అర్ధరాత్రి వరకు నమోదు చేశారు.మరోవైపు ఫిర్యాదు చేసిన మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల్లో ఆమె మెడపై గాయాల మచ్చలు, చెంపపై గాయాల ఆనవాళ్లు, ఎడమ కాలిపై కూడా గాయాలు ఉన్నట్లు వైద్య సిబ్బంది గుర్తించారు. ఈ కేసుకు సంబంధించిన అన్ని ఆధారాలను సేకరిస్తున్న పోలీసులు.. దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ వ్యవహారం ప్రస-ుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో కోర్టు విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# అగ్రనేత మిసిర్ బెస్రా అరెస్ట్



**ఝార్ఖండ్ :** మావోయిస్ట్ అత్యున్నత కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరోలో మిగిలి ఉన్న ఏకైక అగ్రనేత మిసిర్ బెస్రా ను మంగళవారం రాత్రి భద్రతా బలగాలు అరెస్ట్ చేశాయి. ఝార్ఖండ్‌లోని ధన్‌బాద్-గిరిడీ జిల్లాల సరిహద్దులోని తుండి-మండియా అటవీ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్, ఝార్ఖండ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో బెస్రా పోలీసులకు చిక్కినట్లు ప్రకటించారు. ఆయనతో పాటు అనుచరులు గౌరవ్ హ-స్దా, మోచూలను కూడా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. సీఆర్పీఎఫ్ మోహరింపు తీవ్రతరం కావడం, అలాగే అంతకుముందు రోజే తన ప్రధాన అనుచరులు 16 మంది పోలీసులు ఎదుట లొంగిపోవడంతో అడవి నుంచి తప్పించుకునేందుకు యత్నిస్తుండగా ఆయనను పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. ఆయనపై ప్రభుత్వం రూ.కోటికి పైగా ఇనాం (రివార్డు) ప్రకటించి ఉ ంది.మిసిర్ బెస్రా అరెస్ట్ తో మావోయిస్ట్ కేంద్ర కమిటీకి చెందిన క్రియాశీల నాయకులు ఎవరు బయట లేనట్లయింది. ఒకప్పుడు 40 మందికి పైగా సభ్యులు ఉ న్న కేంద్ర కమిటీలోని నేతలను భద్రతా బలగాలు వరుస ఎన్‌కౌంటర్లు, అరెస్టులు, లొంగిబాటల ద్వారా మట్టుబెట్టగా, రెండ దశాబ్దాలుగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న బెస్రా కూడా ఇప్పుడు పట్టుబడ్డారు. వెస్ట్ సింగ్‌భూమ్ జిల్లాలోని సారండా అడవుల్లో బెస్రా ప్రభావం వల్లే కేంద్ర ప్రభుత్వం ఆ జిల్లాను 'నక్సల్ ప్రభావిత ప్రాంతం'గా కొనసాగించింది. ఇప్పుడు ఆయన అరెస్ట్‌తో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెస్ట్ సింగ్‌భూమ్ హోదాపై పునఃసమీక్ష జరిపే అవకాశమున్నట్లు తెలుస్తుంది.

# ప్రతి ఓటర్ నిర్ణీత గడువులోపు (సర్) ఫారాలు అందజేయాలి



- మేడిపల్లి తహసిల్దార్ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం
- అర్హులైన ప్రతి ఓటరు గడువులోపు దరఖాస్తు చేసుకోవాలి
- ప్రత్యేక సవరణ ఫారాల సమర్పణపై అధికారుల సూచనలు
- ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్ని పార్టీలకు విజ్ఞప్తి

**మేడిపల్లి,ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** ప్రత్యేక సవరణ (సర్)ఫారాల సమర్పణ గడువు సమీపిస్తున్న నేపథ్యంలో బుధవారం మేడిపల్లి తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి బీజేపీ సీనియర్ నాయకులు మామిడి వెంకటేష్ తో కలిసి హాజరయ్యాను. ప్రత్యేక సవరణ (సర్) ఫారాల సమర్పణ గడువు సమీపిస్తున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఓటరు నిర్ణీత గడువులోపు తమ దరఖాస్తులను సమర్పించేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించి, ప్రజలకు అవగాహన కల్పించి, గడువులోగా ఎక్కువ సంఖ్యలో ఫారాలు సమర్పించేలా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని తహసిల్దార్ వెంకట్ నర్సింహారెడ్డి కోరారు

# భారత్ లో భారీగా పెరిగిన కోటీశ్వరులు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** భారతదేశ ఆర్థిక పురోగతితో పాటు కోటీశ్వరుల సంఖ్య కూడా అనూహ్యంగా పెరుగుతోంది. గడిచిన ఐదేళ్ల కాలంలో దేశంలో సంవత్సరానికి రూ. 100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ స్థూల ఆదాయాన్ని ఆర్జిస్తున్న పన్ను చెల్లింపుదారుల సంఖ్య దాదాపు నాలుగు రెట్లు పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వం తాజాగా పార్లమెంట్‌లో వెల్లడించింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో అడిగిన ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ ఈ వివరాలను స్పష్టం చేశారు. ఆదాయపు పన్ను చట్టంలో 'బిలియనీర్' అనే పదానికి ప్రత్యేక నిర్వచనం లేనప్పటికీ, పన్ను చెల్లింపుదారులు సమర్పించిన ఐటీ రిటర్న్ల ఆధారంగా రూ. 100 కోట్లకు పైగా వార్షిక ఆదాయం ప్రకటిస్తున్న వారి వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేసింది.కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన అధికారిక గణాంకాల ప్రకారం.. 2021-22 అంచనా సంవత్సరంలో రూ. 100 కోట్లకు పైబడి రాబడి ఉన్న పన్ను చెల్లింపుదారులు కేవలం 142 మంది మాత్రమే ఉండేవారు. కానీ ఆ తర్వాతి సంవత్సరాల్లో ఈ సంఖ్య వేగంగా పెరుగుతూ వచ్చింది. 2022-23 నాటికి ఈ సంఖ్య 301కి చేరగా, 2023-24లో స్వల్పంగా తగ్గి 284 నమోదు కావడం గమనించవచ్చు. అయితే 2024-25లో మళ్లీ పుంజుకుని 415కి ఎగబాకింది, అలాగే 2025-26 అంచనా సంవత్సరం నాటికి ఏకంగా 576 మంది పన్ను చెల్లింపుదారులు రూ. 100 కోట్లకు పైగా వార్షిక రాబడి కలిగి ఉన్నట్లు నమోదైంది. ఈ రకంగా ఐదేళ్లలోనే ఈ సంఖ్య 142 నుంచి 576కి పెరగడం విశేషం.మరోవైపు ధనికులు, పేద ప్రజల మధ్య ఆదాయ వ్యత్యాసాలను తగ్గించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆర్థిక శాఖ తెలిపింది. సమాజంలో అందరికీ సమాన అవకాశాలు, ఉపాధి కల్పన, వెనుకబడిన వర్గాలకు ఉపయోగపడే పన్ను విధానాల ద్వారా అభివృద్ధి ఫలాలను అందరికీ




అందిస్తున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇటీవల నిర్వహించిన 'హౌస్‌హోల్డ్ కన్జంప్షన్ ఎక్స్‌పెండిచర్ సర్వే' వివరాల ప్రకారం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆదాయ అసమానతలను కొలిచే సూచీ గణనీయంగా తగ్గిందని, ఇది దేశంలో సమగ్ర ఆర్థిక వృద్ధి జరుగుతోందనడానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు.

# శబ్దశక్తి,అర్థయుక్తి సినారే ప్రత్యేకత

## గురు పరంపరకు ఆద్యులు వ్యాసభగవానుడు



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జప్తి వీరప్ప గూడెం నందు ప్రముఖ కవి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత ఆచార్య సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె) 95వ జయంతి కార్యక్రమం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు గుడిపాటి కోటయ్య మాట్లాడుతూ సినారే తన రచనల ద్వారా తెలుగు సాహిత్యానికి ఎనలేని కృషిచేశారు అని అలాగే ఇప్పటి యువకులకు యువ సాహితీవేత్తలకు వారు రాసిన ఆధునికాంధ్ర కవిత్వం సాంప్రదాయాలు ప్రయోగాలు అన్న సిద్ధాంత గ్రంథం నేటికీ ప్రామాణికంగా ఉండటమే వారి యొక్క ప్రతిభకు నిదర్శనమని, వారి రచనల్లో శబ్దశక్తి, అర్థయుక్తి ఎంతోమంది ని ఆకర్షించిందని,సినీ వినీలాకాశంలో నిలిచిన అభినవ అక్షర కర్ణుడుగా "నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని దగ్గర నుండి నేటి అరుంధతి సినిమాలోని జేజమ్మ" పాట వరకు ఎన్నో వందల పాటలను అందించి సినీ కవిగా కీర్తి గడించారని,ప్రపంచ సాహిత్య సమ్మేళనంలో తెలుగు భాష ప్రతినిధిగా పాల్పంచుకున్నారని "పల్లెపరిమలం నింపుకొని మట్టిని ముద్దాడిన తెలంగాణ తేజం" కనక వారి సాహిత్య కృషిని నేటి తరం కొనసాగించవలసిన ఆవశ్యకత ఉన్నదని అందుకే నేటి యువకులు, సాహితివేత్తలు వారిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. గురు(వ్యాస) పూర్ణిమ సందర్భంగా అఖిల విద్యా గురువుగా పేరుగాంచిన వ్యాస మహర్షి యొక్క చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. భారతీయ సాంప్రదాయంలో గురు పరంపరకు,ఆధ్యాత్మికతకు,వేద విభజనకు కారకుడై అఖిల విద్యా గురుడుగా పేరుగాంచిన వేద వ్యాసుని యొక్క పరంపరను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎడవల్లి దామోదర్ రెడ్డి,పి.జగదీశ్వర్ రెడ్డి,ఒట్టె మాధవి,టి శ్రీనివాసరెడ్డి,జల్ రామ్, చంద్రకళ,రేణుక తతిధర విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు



# గురువును పూజించడం గొప్ప వరం...

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** న్యాయవాద వృత్తిలో అనుభవం, అంకితభావం, నైతికతకు ప్రతీకగా నిలిచిన మిర్యాలగూడకు చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది నేతి సత్యనారాయణ ను గురుపూజోత్సవం రోజున తమ జూనియర్ న్యాయవాదులు సన్మానించారు. ఈ సందర్భంగా యువ న్యాయవాదులు మాట్లాడుతూ గురువును సన్మానించుకోవడం అత్యంత ఆనందదాయకం మరియు స్ఫూర్తిదాయకం.ఒక మంచి న్యాయవాదిని తీర్చిదిద్దడంలో గురువు పాత్ర ఎనలేనిది.చట్టంలోని మెలకువలను నేర్పడమే కాకుండా,సమాజంలో న్యాయం పట్ల నిబద్ధతను, వృత్తి ధర్మాన్ని ఆచరించి చూపిన నేతి సత్యనారాయణ మార్గదర్శకత్వం ఈ యువ న్యాయవాదులకు ఒక గొప్ప వరం అన్నారు.వృత్తి పట్ల అంకితభావంతో ముందుకు సాగుతూ,తమ గురువు కి తగిన గౌరవాన్ని అందించిన జూనియర్ న్యాయవాదులు బొంగర్ల నాగరాజు,పగడాల క్రాంతి కుమార్,మామిడి భాను ప్రకాష్,పెద్దమం కిరణ్,రాయారపు దిలీప్ ల సంస్కారం మరియు గురుభక్తి అభినందనీయం. నేతి సత్యనారాయణ మాట్లాడుతూ ఆ దేవుడిదీవెనలతో ఈ యువ న్యాయవాదులందరూ భవిష్యత్తులో అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని, న్యాయవాద రంగంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకోవాలని మనసారా దీవించారు.

# శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం





**వలిగొండ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** వలిగొండ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీవత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం-వెంకటాపురం గ్రామం యందు బుధవారం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సమావేశానికి భువనగిరి శాసనసభ సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి విచ్చేయగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువాతో సత్కరించడం జరిగింది. ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం ఎన్.నిఖిల్ పరిశీలకులు, దేవాదాయ ధర్మదాయ శాఖ, భువనగిరి డివిజన్ వారి పర్యవేక్షణలో నిర్వహించడమైనది. ముందస్తుగా తుమ్మల శ్రీనివాస్, తుమ్మల కరుణాకర్ రెడ్డి, దామెర అనంతాచారి, కంబాలపల్లి అండాలు, కొత్త జంగయ్య, ఆవుల చంద్రకళ, రాధారపు రమేష్, భట్టు నర్సింహ్మా, మీసాల ముత్యాలు, కేశిరెడ్డి నరేందర్ రెడ్డి, కూర వెంకటేశం, ఎస్.నర్సింహ్మా, బుర్కల కుమార్ గౌడ్, బోడిగే వెంకటేశం, ధర్మకర్తలుగా ప్రతాపురం శ్రీనివాసచార్యులు ఎక్స్-అఫీషియో మెంబర్ గా ప్రమాణ స్వీకారం చేయడమైనది. తదుపరి ధర్మకర్తల మండలి చైర్మన్ ఎన్నికలో తుమ్మల కరుణాకర్ రెడ్డి తుమ్మల శ్రీనివాస్ ను చైర్మన్ గా ప్రతిపాదించగా కొత్త జంగయ్య బలపర్చారు. ఇతర ప్రతిపాదనలు ఏమియు లేనందున ధర్మకర్తల మండలి చైర్మన్ గా తుమ్మల శ్రీనివాస్ ను ఆమోదించడమైనది. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామపెద్దలు, అర్చకులు, సిబ్బంది పాల్గొనడమైనదని కార్యనిర్వహణాధికారి కొత్తపల్లి వెంకటయ్య తెలిపారు.

# ఇంటింటికి ఒక మొక్క నాటాలి




**ఘట్కేసర్,ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ఘట్కేసర్ సర్కిల్ పోచారం డివిజన్లోని కచవానిసింగారం మహేశ్వరి కాలనీ జానకి హోమ్స్ యు బి డి వింగ్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది మొక్కల పంపిణీ చేశారు. జానకి హోమ్స్ కాలనీ వాసులకు కాలనీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డికీ మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెట్లు మానవాళికి జీవనాధారం అని ప్రతి ఒక్కరు ఇంటింటికి ఒక మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. ఇందులో జానకీ హోమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల మౌలికవసతుల కల్పనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి





**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని,పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తలుతో పాటు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు.బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రాథమిక పాఠశాల ఎన్ఎస్పి క్యాంప్ నందు రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్ కస్తూరి ప్రభాకర్ తల్లి కస్తూరి రాములమ్మ స్మృత్యర్థం ఏర్పాటుచేసిన స్మృతి భోజనం కార్యక్రమాన్ని విద్యార్థులకు వడ్డించి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పాఠశాల టాయిలెట్స్ పెండింగ్లో ఉండగా తన దృష్టికి రాగా వెంటనే వాటిని పూర్తి చేయించడం జరిగిందని అదేవిధంగా రంగులు వేయించడానికి కూడా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు.మిర్యాలగూడ మునిసిపల్ వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ మాట్లాడుతూ కొంతమంది విద్యార్థులు బాక్సులలో చిన్న చిన్న ప్లేట్లలో అన్నం తింటున్నారని వారిని దృష్టిలో పెట్టుకొని అందరికీ ప్లేట్లు అందే విధంగా 150 ప్లేట్లను అందజేయనున్నట్లు తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయుడైనప్పటికీ ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తూనే తోడ్పాటు నిర్వహిస్తున్న కస్తూరి ప్రభాకర్ ను అభినందించారు.ఈ కార్యక్రమంలో కస్తూరి ప్రభాకర్, ప్రముఖ వైద్యులు జాడి రాజు, జన విజ్ఞాన వేదిక నాయకులు సుదర్శన్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాష్య, ఉపాధ్యాయులు సుదర్శన్ రెడ్డి,లక్ష్మీనారాయణ,జానయ్య,ఇందిరా,వెంకటలక్ష్మి,పాఠశాల సిబ్బంది భూలక్ష్మి,బీబీ ఆయేషా,వాసు,సమీమా,మౌనిక,హారిక,వర్ష పాల్గొన్నారు.

# ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు జమ కావాలి





**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జిల్లాలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవా నియమాలు, జీతాల చెల్లింపులు, ఏజెన్సీల బాధ్యతలను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో అమలు చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల నియామకాలు సంబంధిత గుర్తింపు పొందిన ఏజెన్సీల ద్వారా నిర్వహించడం జరుగుతోందని తెలిపారు.ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు ఆయా ఏజెన్సీలతో ఈ నెల 25వ తేదీలోగా అగ్రిమెంట్ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.ఈ అగ్రిమెంట్ సాధారణ ఒప్పందం కాకుండా త్రైపాక్షిక (Tripartite) ఒప్పందం రూపంలో ఉండాలని స్పష్టం చేశారు. ఇందులో సంబంధిత శాఖ (Concerned Department) మొదటి పక్షంగా, ఔట్సోర్సింగ్ ఏజెన్సీ రెండో పక్షంగా, జిల్లా కలెక్టర్, ఔట్సోర్సింగ్ కమిటీ ఛైర్మన్ మూడో పక్షంగా ఉంటారని తెలిపారు. ఈ విధానంతో ఉద్యోగుల హక్కులకు రక్షణ కల్పించడంతో పాటు ఏజెన్సీల బాధ్యతను మరింత పెంచడం లక్ష్యమన్నారు.అగ్రిమెంట్ను రూ.100 విలువ గల నాన్-జ్యుడీషియల్ స్టాంప్ పేపర్ విలువ గల బాండ్పై నమోదు చేయాలని సూచించారు. ఒప్పందంలోని నిబంధనలను ఏజెన్సీలు ఉల్లంఘించినట్లయితే, వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఒప్పంద నిబంధనల ప్రకారం తగిన చర్యలు కూడా అమలు చేస్తామని హెచ్చరించారు.జిల్లాలోని అన్ని శాఖాధిపతులు ప్రతి నెల ఒకటో తేదీన ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు వారి బ్యాంకు ఖాతాల్లో తప్పనిసరిగా జీతం తో పాటు EPF, ESI కూడా సంబంధిత ఉద్యోగి ఖాతా లో జమ అయ్యేలా శాఖ అధిపతులు, ఏజెన్సీ యాజమాన్యం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఉద్యోగులకు జీతాల చెల్లింపులో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ప్రస్తుతం జిల్లాలో (8) ఔట్సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా 577 మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులు వివిధ ప్రభుత్వ శాఖల్లో సేవలందిస్తున్నారని తెలిపారు. వీరి సేవా భద్రత, వేతనాల సకాలంలో చెల్లింపు, ఒప్పంద నిబంధనల అమలు, బాధ్యతాయుత పరిపాలనకు ఈ త్రైపాక్షిక ఒప్పంద విధానం దోహదపడుతుందని స్పష్టం చేశారు.

# డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి






**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఎస్ఐఆర్ కార్యక్రమంలో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు నాలుగు నుంచి ఐదు రోజులే మిగిలి ఉండటంతో ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన ఈ మేరకు సూచనలు చేశారు.బీఎల్వోలు నమోదు చేసిన ఓటర్ల వివరాల్లో పొరపాట్లు ఉన్నట్లు గుర్తించినందున ఈఆర్వోలు, సూపర్వైజర్లు ప్రతి నమోదును పునఃపరిశీలించి రెండు రోజుల్లోగా అన్ని లోపాలను సరిదిద్దాలని ఆదేశించారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నిర్లక్ష్యం చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రాష్ట్రవ్యాప్తంగా 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 100 శాతం, 80 నియోజకవర్గాల్లో 90 శాతానికి పైగా డిజిటలైజేషన్ పూర్తైందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని, దీనిపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లాలో ఇప్పటివరకు 99.19 శాతం డిజిటలైజేషన్ పూర్తైందని, మరో రెండు రోజుల్లో 100 శాతం పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి డిజిటలైజేషన్ను గడువులోగా తప్పులులేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు.

# డ్రగ్స్ నిర్మూలనలో వైఏసీకి ప్రశంసలు




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** డ్రగ్స్ నిర్మూలనపై సమాజంలో విస్తృత అవగాహన కల్పిస్తున్న యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థకు ప్రశంసలు దక్కాయి. సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి చేస్తున్న సేవలను గుర్తించి తెలంగాణ పోలీస్ ఈగల్ ఫోర్స్ డైరెక్టర్, మాజీ డీజీపీ సందీప్ శాండిల్య అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఈగల్ ఫోర్స్ నుంచి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. తెలంగాణలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలు, యువతలో మాదకద్రవ్యాలపై చైతన్యం కల్పించేందుకు చేపడుతున్న సేవలను గుర్తించి ఈ ప్రశంసాపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఐపీఎస్ (రిటైర్డ్) మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రభుత్వ శాఖలతో పాటు స్వచ్ఛంద సంస్థలు, యువత భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి తన బృందంతో చేస్తున్న సేవలు, డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని అభినందించారు. రాజేంద్ర పల్నాటి మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలను తమ సంస్థ నుంచి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మరింత విస్తృతంగా కొనసాగిస్తామన్నారు. ప్రజలందరూ డ్రగ్స్కు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. వీరితో పాటు యాక్ సంస్థ జీహెచ్ఎంసీ అధ్యక్షుడు కొన్నె దేవేందర్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

# ఖైరగూడ ఓపెన్ కాస్ట్ ఘన విజయం..



**రెబ్బెన,ఫ్లాష్ ఇండియా :** గోలేటి సింగరేణి సంస్థ బెల్లంపల్లి ఏరియా పరిధిలోని ఖైరగూడ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు భద్రతా వారోత్సవాల పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి ప్రాజెక్టు చరిత్రలో తొలిసారిగా నాలుగు ప్రధాన బహుమతులు సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం ఖైరగూడ ఓపెన్ కాస్ట్ ప్రాంగణంలో విజయోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అధికారుల సమన్వయం, కార్మికుల క్రమశిక్షణతో కూడిన కృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని పేర్కొంటూ అందరికీ అభినందనలు తెలిపారు.భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో సురక్షిత ఉత్పత్తి కొనసాగించాలని సూచించారు. ఖైరగూడ ప్రాజెక్టు ఆఫీసర్ మచ్చగిరి నరేందర్, మేనేజర్ జె.శంకర్ మాట్లాడుతూ ఈ విజయం ప్రాజెక్టులోని ప్రతి ఉద్యోగి, కార్మికుడి సమిష్టి కృషికి నిదర్శనమని అన్నారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్. తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అధికారి రజిని, ఏరియా ఇంజనీర్ వీరన్న, ఎస్వో టు జీఎం రాజమల్లు, ఏరియా సేఫ్టీ అధికారులు, ఏఐటీయూసీ నాయకులు మారం శ్రీనివాస్, కిరణ్, రక్షణ అధికారి గౌతమ్ రాజేశ్వర్ రెడ్డి, అధికారులు, సూపర్వైజర్లు, సేఫ్టీ కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.



# ర్యాన్ డస్కాటె భలే లక్కీ!

టీమిండియా అసిస్టెంట్ కోచ్ పదవికి వీడ్కోలు పలికిన మరుసటి రోజే ర్యాన్ టెన్ డస్కాటెకు కొత్త బాధ్యతలు దక్కాయి. భారత క్రికెట్ జట్టు కోచింగ్ స్టాఫ్‌లో తన ప్రయాణాన్ని ముగించిన డస్కాటె.. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో మూడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) ఫ్రాంచైజీలో చేరాడు. ఈ విషయాన్ని కేకేఆర్ యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది. డస్కాటెకు హెడ్ ఆఫ్ క్రికెట్ స్ట్రాటజీగా నియమిస్తూ.. నైట్ రైడర్స్ గ్లోబల్ క్రికెట్ వ్యవస్థలో కీలక బాధ్యతలు అప్పగించింది.ర్యాన్ టెన్ డస్కాటె ఇకపై ఆటగాళ్ల అన్వేషణ (స్కౌటింగ్), కొత్త ఆటగాళ్ల ఎంపిక, జట్టు ప్రణాళిక, ప్రతిభాభివృద్ధి, ప్రదర్శన విశ్లేషణ వంటి కీలక అంశాలను పర్యవేక్షించనున్నాడు అని కేకేఆర్ తెలిపింది. అలాగే నైట్ రైడర్స్‌కు చెందిన అన్ని గ్లోబల్ ఫ్రాంచైజీల కోచింగ్ బృందాలతో కలిసి పనిచేయనున్నాడు. అదనంగా కరేబియన్ ప్రీమియర్ లీగ్‌లో ట్రిన్‌బాగో నైట్ రైడర్స్, ఐఎల్‌టీ20లో అబుదాబి నైట్ రైడర్స్, మేజర్ లీగ్ క్రికెట్‌లో లాస్ ఏంజెలెస్ నైట్ రైడర్స్ జట్లకు అసిస్టెంట్ కోచ్‌గా కూడా సేవలందించనున్నాడు.ర్యాన్ టెన్ డస్కాటె నియామకంపై నైట్ రైడర్స్ స్పోర్ట్స్ సీఈఓ వెంకీ మైసూర్ ఆనందం వ్యక్తం చేశారు. 'టెండోను మళ్లీ నైట్ రైడర్స్ ఫ్యామిలీలోకి స్వాగతించడం ఎంతో సంతోషంగా ఉంది. మా క్రికెట్ ఫిలాసఫీ, వ్యవస్థపై అతడికి పూర్తి అవగాహన ఉంది. అంతర్జాతీయ, ఫ్రాంచైజీ క్రికెట్‌లో అతడికి ఎంతో అనుభవం ఉంది. అందుకే ఈ బాధ్యతలు అప్పగించాం. నైట్ రైడర్స్ గ్లోబల్ వ్యవస్థ అభివృద్ధిలో డస్కాటె కీలక పాత్ర పోషిస్తాడని విశ్వసిస్తున్నాం' అని పేర్కొన్నారు. మరోవైపు ర్యాన్ టెన్ డస్కాటె కూడా తన పునరాగమనంపై సంతోషం వ్యక్తం చేశాడు. 'మళ్లీ నైట్ రైడర్స్ కుటుంబంలో చేరడం చాలా ఆనందంగా ఉంది. మా గ్లోబల్ ఫ్రాంచైజీల కోచింగ్, అనలిటిక్స్ బృందాలతో కలిసి స్కౌటింగ్, ప్లేయర్ డెవలప్‌మెంట్ వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం, దీర్ఘకాలిక క్రికెట్ వ్యూహాన్ని రూపొందించడం నా ప్రధాన లక్ష్యం' అని తెలిపాడు.ర్యాన్ టెన్ డస్కాటెకు నైట్ రైడర్స్ ఫ్రాంచైజీతో దశాబ్దానికి పైగా అనుబంధం ఉంది. 2011లో కేకేఆర్ తరఫున ఆటగాడిగా చేరిన అతడు.. 2012, 2014లో ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. అనంతరం 2022లో కోచింగ్ బృందంలో చేరి.. 2024లో కేకేఆర్ మూడోసారి ఐపీఎల్ ట్రోఫీ గెలిచిన సీజన్‌లో కీలక పాత్ర పోషించాడు. ఇప్పుడు కొత్త బాధ్యతలతో మరోసారి నైట్ రైడర్స్ గ్లోబల్ క్రికెట్ వ్యవస్థలో తన ముద్ర వేయడానికి సిద్ధమయ్యాడు.

# టీమిండియా కొత్త కోచ్



ఆటగాడిగా రిటైర్ అయిన తర్వాత సుభదీప్ ఘోష్ కోచింగ్ వైపు వెళ్లి మంచి గుర్తింపు పొందాడు. రాహుల్ ద్రవిడ్ నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో ఉన్న కాలం నుంచి.. గత ఆరు నుంచి ఏడు సంవత్సరాలుగా భారత క్రికెట్ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. 2021లో ఆస్ట్రేలియా పర్యటనలో భారత మహిళల జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా పనిచేశాడు. అలాగే ఇండియా-ఏ, భారత అండర్-19 జట్లతో కూడా పనిచేశాడు. 2024 అండర్-19 ప్రపంచ కప్‌లో భారత జట్టు సపోర్ట్ స్టాఫ్‌లో కూడా ఘోష్ సభ్యుడిగా ఉన్నాడు.

**ఐపీఎల్‌లోనూ విజయవంతమైన ప్రయాణం:**

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో కూడా సుభదీప్ ఘోష్‌కు మంచి అనుభవం ఉంది. 2014లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) జట్టు రెండోసారి ఐపీఎల్ టైటిల్ గెలిచిన సీజన్‌లో కోచింగ్ బృందంలో కీలక బాధ్యతలు నిర్వహించాడు. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్‌కు కూడా ఫీల్డింగ్ కోచ్‌గా సేవలందించాడు. దేశవాళీ, జాతీయ, ఐపీఎల్ స్థాయిల్లో విస్తృత అనుభవం ఉండటంతో టీమిండియా కొత్త ఫీల్డింగ్ కోచ్ రేసులో ఆయన ముందంజలో ఉన్నట్లు సమాచారం.

**బీసీసీఐ తుది నిర్ణయం ఎప్పుడు:**

టీ దిలీప్ స్థానంలో కొత్త ఫీల్డింగ్ కోచ్‌ను నియమించేందుకు బీసీసీఐ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. ఇద్దరు లేదా ముగ్గురు అభ్యర్థులతో చర్చలు కొనసాగుతున్నాయని బోర్డు వర్గాలు తెలిపాయి. శ్రీలంక పర్యటనకు ముందు కొత్త ఫీల్డింగ్ కోచ్ పేరును అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం వినిపిస్తున్న పేర్లలో సుభదీప్ ఘోష్‌నే ప్రధాన ఫేవరెట్‌గా భావిస్తున్నారు. అతడే దాదాపుగా ఫిక్స్ అని తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# చరిత్ర సృష్టించిన గుల్వీర్ సింగ్..





గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్‌లో భారత లాంగ్ డిస్టెన్స్ రన్నర్ గుల్వీర్ సింగ్ అద్భుత ప్రదర్శనతో చరిత్ర సృష్టించాడు. పురుషుల 10,000 మీటర్ల పరుగుపందెంలో రజత పతకం సాధించాడు. దీంతో ఈ విభాగంలో రజతం సాధించిన తొలి భారత పురుష అథ్లెట్‌గా రికార్డులకెక్కారు. జాతీయ రికార్డు హోల్డరైన గుల్వీర్.. స్కాట్‌స్టౌన్ స్టేడియంలో జరిగిన ఈ ఫైనల్ రేసును 27:49.8 సెకన్లలో పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియాకు చెందిన కై రాబిన్సన్ స్వర్ణ పతకం కైవసం చేసుకోగా.. ఐల్ ఆఫ్ మ్యాన్‌కు చెందిన డేవిడ్ ముల్లార్కీ కాంస్యం దక్కించుకున్నాడు.గ్లాస్గోలో కురుస్తున్న వర్షాన్ని లెక్కచేయకుండా, అగ్రశేణి ఆఫ్రికన్ రన్నర్లతో పోటీ పడుతూ గుల్వీర్ అత్యంత వ్యూహాత్మకంగా రేసును సాగించాడు. తొలుత అగ్రస్థానాల కోసం పోటీపడిన ఆయన, రేసు మధ్యలో కొంత వెనుకబడినప్పటికీ పట్టుసడలించలేదు. చివరి 1000 మీటర్ల దూరం ఉన్నప్పుడు అద్భుతమైన వేగాన్ని ప్రదర్శించి ప్రత్యర్థులను వెనక్కి నెట్టాడు. చివరి క్షణంలో అదిరిపోయే కిక్‌తో పరుగును ముగించి రజతం సొంతం చేసుకున్నాడు.కామన్వెల్త్ గేమ్స్ పురుషుల 10,000 మీటర్ల విభాగంలో 1986 తర్వాత ఆఫ్రికేతర ఆటగాడు పోడియంపై నిలవడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఇది 2022 ఎడిషన్‌లో అవినాష్ సాబ్లే సాధించిన పతక విజయాలను గుర్తుచేసింది. భారత్ తరఫున అంతకుముందు 2010 ఢిల్లీ కామన్వెల్త్ గేమ్స్‌లో కవితా రౌత్ మహిళల విభాగంలో కాంస్యం నెగ్గగా, ఇప్పుడు పురుషుల విభాగంలో గుల్వీర్ సింగ్ ఈ చారిత్రక మైలురాయిని తాకి దేశం గర్వపడేలా చేశాడు.



# వెయిట్ లిఫ్టింగ్‌లో మరో మెడల్

గ్లాస్గోలోని కామన్ వెల్త్ గేమ్స్ లో మన భారత అథ్లెట్స్ దూసుకు వెళ్తున్నారు. తాజాగా ఇండియాకు చెందిన వెయిట్ లిఫ్టింగ్ లో మరో మెడల్ దక్కింది. మహిళల 69 కేజీల కేటగిరీలో హర్జిందర్ కౌర్ సిల్వర్ మెడల్ సాధించారు. స్నాచ్ 101KG, క్లీన్ అండ్ జర్క్ లో 120 కిలోలు లిఫ్ట్ చేసిన హర్జిందర్ కౌర్ మొత్తంగా 227 కిలోల బరువు ఎత్తారు. ఈ క్రమంలోనే హర్జిందర్ కౌర్ కు సిల్వర్ మెడల్ దక్కింది. ఇది ఇలా ఉండగా ఇండియాకు ఇప్పటి వరకు వెయిట్ లిఫ్టింగ్ లో మొత్తం 7 మెడల్స్ దక్కాయి. పారా పవర్ లిఫ్టింగ్ లో ఒక్క మెడల్ వచ్చింది. ఇందులో ఒక గోల్డ్, ఐదు సిల్వర్, రెండు కాంస్యాలు ఉన్నాయి.


# బిజినెస్



# చైనా రోబోలపై అమెరికా నిషేధం

అమెరికా, చైనాల మధ్య సాంకేతిక ప్రపంచంలో ఆధిపత్య పోరు కొత్త మలుపు తిరిగింది. సెమికండక్టర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), 5G నెట్‌వర్కింగ్ పరిశ్రమల తర్వాత, ఇప్పుడు చైనాకు చెందిన 'హ్యూమనాయిడ్ రోబోట్ల' దిగుమతులపై అమెరికా ప్రభుత్వం నిషేధం విధించింది. జాతీయ భద్రత, డేటా గోప్యత, సైబర్ భద్రతా ముప్పులను ప్రధాన కారణాలుగా చూపుతూ ఫెడరల్ కమ్యూనికేషన్స్ కమిషన్ ఈ ఆంక్షలను అధికారికంగా ప్రకటించింది.చైనాకు చెందిన రోబోటిక్స్ కంపెనీలు ఇటీవల వేగంగా అభివృద్ధి సాధిస్తూ, తక్కువ ధరలకే అత్యంత ఆటోమేటెడ్, శక్తివంతమైన హ్యూమనాయిడ్ రోబోట్లను మార్కెట్లోకి తీసుకొస్తున్నాయి. అయితే ఈ రోబోట్లలో అమర్చే కెమెరాలు, హై-ప్రెసిషన్ సెన్సార్లు, మైక్రోఫోన్లు మరియు AI ఆపరేటింగ్ సిస్టమ్స్ ద్వారా అమెరికా పౌరుల వ్యక్తిగత సమాచారంతో పాటు దేశీయ కీలక మౌలిక సదుపాయాలు, ప్యాకేజింగ్ కేంద్రాలు, ఫ్యాక్టరీల డేటా సులభంగా చైనా సర్వర్లకు చేరే ప్రమాదం ఉందని అమెరికా భయాందోళనలు వ్యక్తం చేస్తోంది.గతంలో టెలికాం, డ్రోన్ రంగానికి చెందిన హువావే , డీజేఐ వంటి చైనా దిగ్గజ సంస్థలపై అమెరికా ఎలాంటి కఠిన ఆంక్షలు విధించిందో, అదే వ్యూహాన్ని ఇప్పుడు రోబోటిక్స్ రంగానికి విస్తరించింది. భవిష్యత్తులో గృహ, పారిశ్రామిక వినియోగంలో హ్యూమనాయిడ్ రోబోట్ల పాత్ర అత్యంత కీలకంగా మారనున్న నేపథ్యంలో, అమెరికా స్వదేశీ రోబోటిక్స్ తయారీదారులైన టెస్లా ఆప్టిమస్, ఫిగర్ ఏఐ, బోస్టన్ డైనమిక్స్ వంటి సంస్థలను ప్రోత్సహించడమే కాకుండా అమెరికా సరఫరా వ్యవస్థలను చైనా ఆధిపత్యం నుంచి కాపాడుకోవడం ఈ నిషేధం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని భావిస్తున్నారు.

# తగ్గిన పసిడి ధరలు



హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో గత మూడు రోజులుగా తీవ్ర హెచ్చుతగ్గులకు గురవుతున్న పసిడి ధరలు మరోసారి తగ్గుముఖం పట్టాయి. వారం ప్రారంభంలో (జూలై 27న) 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ. 1,44,920 వద్ద ట్రేడ్ అవ్వగా, జూలై 28 నాటికి అది రూ. 1,44,170కి దిగివచ్చింది. ఈ క్రమంలోనే నేడు (బుధవారం) మరో రూ. 660 తగ్గి 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,43,510కి చేరింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర కూడా రూ. 600 దిగివచ్చి రూ. 1,31,550 వద్ద నమోదైంది.అంతర్జాతీయ మార్కెట్ సూచీలు, డాలర్ మారకం విలువలో మార్పులతో పాటు స్థానిక డిమాండ్‌కు అనుగుణంగా పసిడి ధరల్లో ఈ దిద్దుబాటు చోటుచేసుకుంటోందని బిజినెస్ వర్గాలు తెలిపాయి. కాగా కిలో వెండి ధర మార్కెట్‌లో రూ. 2,35,000 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో నగరాన్ని బట్టి, వ్యాపారులను బట్టి పసిడి ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉండవచ్చని, పైన తెలిపిన ధరలపై 3 శాతం జీఎస్టీ అదనంగా వర్తిస్తుందని నిపుణులు స్పష్టం చేశారు.

# డాలర్‌తో పోలిస్తే 12 పైసలు



అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధ ప్రభావం తగ్గుముఖం పట్టడం, టెన్షన్ వాతావరణం లేకపోవడంతో భారత స్టాక్ మార్కెట్లలో సానుకూల ధోరణి, విదేశీ మూలధన ప్రవాహాల మద్దతు పెరిగింది. దీంతో బుధవారం ఉదయం ఎర్లీ ట్రేడింగ్ లో రూపాయి బలపడింది. బుధవారం నాటి ప్రారంభ వర్తకంలో అమెరికన్ డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ 12 పైసలు పెరిగి 95.70కి చేరింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుసరిస్తున్న వ్యూహాత్మక చర్యలు, క్రూడ్ ఆయిల్ ధరల ఊగిసలాట, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు వంటి అంశాలు రూపాయి విలువను ప్రభావితం చేస్తున్నాయని మార్కెట్ నిపుణులు తెలిపారు. రానున్న రోజుల్లో రూపాయి మారకం విలువ 95.50 నుండి 96.25 శ్రేణిలో ట్రేడ్ అయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

**భారీ లాభాల్లో భారత స్టాక్ మార్కెట్లు..**

పశ్చిమాసియా వార్ టెన్షన్ తగ్గడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ భారీ లాభాల్లో కొనసాగుతున్నాయి. సెన్సెక్స్ 650 పాయింట్లు ఎగసి 77,420 వద్ద, నిఫ్టీ 195 పాయింట్లు లాభపడి 24,179 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. టెక్, టెలికం, బ్యాంకింగ్ షేర్లు గ్రీన్‌లో ఉన్నాయి. అటు క్రూడాయిల్ ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. బ్రెంట్ ధర రూ.4.34% పెరిగి 87.77 డాలర్లకు చేరింది. డాలర్‌తో పోలిస్తే రూపీ విలువ 95.85 వద్ద కొనసాగుతోంది.




# ప్లాస్టిక్ నోట్ల ఎంట్రీకి రంగం సిద్ధం!

దేశంలో త్వరలో రూ.10, రూ.20 విలువైన పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లు చలామణిలోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఈ మేరకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ పంపిన ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు పార్లమెంట్‌లో వెల్లడైంది. తొలి దశలో ఈ నోట్లను ఫీల్డ్ ట్రయల్ కోసం విడుదల చేసి, ప్రయోగం విజయవంతమైతే క్రమంగా సాధారణ చలామణిలోకి తీసుకురానున్నట్లు సమాచారం. ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం.. రూ.10, రూ.20 విలువైన 100 కోట్ల చొప్పున పాలిమర్ నోట్లను ముద్రించి ప్రయోగాత్మకంగా విడుదల చేయనున్నారు. ఈ ట్రయల్ ఫలితాలను పరిశీలించిన తర్వాత తదుపరి నిర్ణయం తీసుకోనున్నారు.అయితే ప్రస్తుతం ప్రజల చేతుల్లో ఉన్న కాగితపు కరెన్సీ నోట్లపై ఎలాంటి ప్రభావం ఉండదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం చలామణిలో ఉన్న కాగితపు నోట్లు కొనసాగుతాయని, వాటిని పూర్తిగా ప్లాస్టిక్ నోట్లతో భర్తీ చేసే ప్రతిపాదన ఇప్పటివరకు లేదని పేర్కొంది. పాలిమర్ నోట్లు సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయని, నకిలీ నోట్లు తయారు చేయడం కష్టమని నిపుణులు చెబుతున్నారు. దీంతో దీర్ఘకాలంలో ముద్రణ వ్యయాన్ని కూడా తగ్గించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ప్రారంభ దశలో ఉండగా, భవిష్యత్తులో డిజిటల్ చెల్లింపులపై దీని ప్రభావాన్ని కూడా అంచనా వేయనున్నారు. ప్లాస్టిక్ కరెన్సీ నోట్లను ప్రపంచంలో తొలిసారిగా 1988లో ఆస్ట్రేలియా ప్రవేశపెట్టింది. ప్రస్తుతం 50కి పైగా దేశాలు పాలిమర్ నోట్లను ఉపయోగిస్తున్నాయి. ఇటీవల ఆర్‌బీఐ ఈ ప్రాజెక్టుకు సంబంధించి గ్లోబల్ టెండర్లను ఆహ్వానించినట్లు కూడా సమాచారం. దీంతో భారత్‌లో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు అందుబాటులోకి రావడానికి మార్గం సుగమమవుతోంది.




## ఓటీటీలోకి బ్లాక్ బస్టర్ మూవీ 'గట్టకుస్తీ-2'

థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం, మొదటి రోజు నుంచే బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్ టాక్‌తో దూసుకుపోయింది.మొదటి భాగం తరహాలోనే ఇందులో కూడా భార్యాభర్తల మధ్య వచ్చే సరదా గొడవలు, కామెడీ సన్నివేశాలు, కుస్తీ క్రీడకు సంబంధించిన థ్రిల్లింగ్ అంశాలు, కుటుంబ భావోద్వేగాలు చూపించిన తీరు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.థియేటర్లలో ఈ సినిమా సాధించిన అద్భుతమైన విజయం నిర్మాతలకు మంచి లాభాలను తెచ్చిపెట్టడమే కాకుండా, హీరో విష్ణు విశాల్‌కు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. ఈ ఆనందంతో ఆయన చిత్ర యూనిట్ సభ్యుల కష్టాన్ని గుర్తించి వారికి ఖరీదైన కార్లు, బహుమతులను కానుకగా అందించిన విషయం సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. ఇక థియేటర్లలో విపరీతంగా అలరించిన ఈ స్పోర్ట్స్ ఎంటర్‌టైనర్ చిత్రం, ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై అలరించడానికి సిద్ధమైంది. ఈ సినిమాకు సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకే దక్కించుకోగా.. జూలై 31 నుంచి ఈ సినిమాను స్ట్రీమింగ్‌కు తీసుకురాబోతున్నట్లు ఓటీటీ సంస్థ అధికారికంగా స్పష్టం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ చిత్రాన్ని కేవలం తమిళంలోనే కాకుండా తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ వంటి ఐదు ప్రధాన భాషల్లో ఒకేసారి అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

## 'ఐకాన్‌జా'తో మరో అడుగు..



పాన్ ఇండియా స్టార్‌గా వరుస విజయాలతో దూసుకుపోతున్న అల్లు అర్జున్, ఇప్పుడు వ్యాపార రంగంలోనూ తన ఉనికిని మరింత బలోపేతం చేసుకుంటున్నారు. సినిమాలతో కోట్లాది అభిమానులను సంపాదించుకున్న ఆయన, దీర్ఘకాలిక పెట్టుబడుల విషయంలోనూ వ్యూహాత్మకంగా ముందుకెళ్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ చిత్రం 'రాకా'పై అందరి దృష్టి ఉండగా, హైదరాబాద్‌లో ఆయన నిర్మిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్న కొత్త కార్పొరేట్ కార్యాలయం ఇప్పుడు మరో హాట్ టాపిక్‌గా మారింది. సినీ ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, అల్లు అర్జున్ హైదరాబాద్‌లో 'ఐకాన్జా' పేరుతో ఒక ప్రతిష్టాత్మక ఆఫీస్ స్పేస్‌ను నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. అభిమానులు ప్రేమగా పిలిచే 'ఐకాన్ స్టార్' అనే బిరుదు నుంచే ఈ పేరుకు ప్రేరణ లభించిందని చెబుతున్నారు. 'ఐకాన్' పదానికి తన పేరులోని అక్షరాలను జోడించి 'ICON-ZAA' అనే పేరును ఖరారు చేసినట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్ డిజైన్, నిర్మాణానికి సంబంధించిన ప్రతి అంశాన్ని అల్లు అర్జున్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారని కూడా ప్రచారం సాగుతోంది.




## ఫస్ట్ సింగిల్ రిలీజ్..!

మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా పవన్ సాదినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం 'ఆకాశంలో ఒక తార' నుంచి ఫస్ట్ సింగిల్ 'చిట్టి చిట్టి చీమ'ను చిత్రబృందం విడుదల చేసింది. దుల్కర్ సల్మాన్ పుట్టినరోజు సందర్భంగా ఈ మెలోడీ సాంగ్‌ను విడుదల చేస్తూ మేకర్స్ ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా సమర్పణలో లైట్‌బాక్స్ మీడియా బ్యానర్‌పై సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో సాత్విక వీరవల్లి కథానాయికగా పరిచయం అవుతుండగా, శృతి హాసన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ స్వరపరిచిన ఈ పాటకు ప్రముఖ గేయరచయిత శ్రీమణి అర్థవంతమైన సాహిత్యాన్ని అందించారు. గాయని రమ్య బెహరా తన గాత్రంతో పాటకు మరింత అందం తీసుకొచ్చారు. 'చిట్టి చిట్టి చీమ' అంటూ జీవితంలో పెద్ద లక్ష్యాలను సాధించాలనే పట్టుదల, కష్టపడే తత్వాన్ని ఈ పాటలో అందంగా చూపించారు. లిరికల్ వీడియోలో ఆస్ట్రోనాట్ కావాలనే కలతో గ్రామం నుంచి నగరానికి వచ్చిన యువతి ప్రయాణాన్ని, ఆమె ఆశయాలకు హీరో అండగా నిలిచే విధానాన్ని చాలా బాగా చూపించారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు సినిమాపై ఆసక్తిని పెంచగా.. ఇప్పుడు ఫస్ట్ సింగిల్‌తో అంచనాలు మరింత పెరిగాయి. 'మహానటి', 'సీతారామం', 'లక్కీ భాస్కర్' వంటి విజయాల తర్వాత మరో హృదయాన్ని హత్తుకునే కథతో దుల్కర్ ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఈ పాట స్పష్టం చేస్తోంది. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానున్న 'ఆకాశంలో ఒక తార' త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ట్రైలర్‌కు ముహూర్తం ఫిక్స్..







తాజాగా ఈ చిత్రం ప్రమోషన్లలో భాగంగా మూవీ మేకర్స్ ఒక క్రేజీ అప్‌డేట్‌ను పంచుకున్నారు. 'నిరమ్' చిత్రానికి సంబంధించిన ఆడియో లాంచ్, ట్రైలర్‌ను జూలై 30న ఘనంగా విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా పంచుకున్న స్పెషల్ పోస్టర్‌లో ఒక పెద్ద డోలుపై ఎర్రటి గుడ్డ వేసి, దాని చుట్టూ పూలు, దీపాలతో ఎంతో సాంప్రదాయబద్ధంగా అలంకరించి ఉంది. "కథలోని విభిన్న కోణాలను చూసేందుకు సిద్ధంగా ఉండండి" అంటూ మేకర్స్ తెలిపిన విధానం నెటిజన్లను ఆకట్టుకుంటోంది. షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని ఆగస్టులో థియేటర్స్‌లోకి తీసుకొచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

## స్టైలిష్ లుక్‌లో రామ్ పోతినేని..

రామ్ పోతినేని హీరోగా నటిస్తూ తొలిసారి మెగా ఫోన్ చేపట్టి తెరకెక్కిస్తున్న చిత్రం 'RAPO23' (వర్కింగ్ టైటిట్). ఈ సినిమాను రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై కృష్ణ పోతినేని నిర్మాణంలో భారీ స్థాయిలో ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అంతే కాకుండా.. రామ్ కెరీర్‌లోనే ఈ సినిమా అత్యధిక బడ్జెట్‌తో పాటు ఆయన స్వీయ డైరెక్షన్‌లో రాబోతుండగా.. అభిమానులతో పాటు ప్రేక్షకుల్లో కూడా భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించిన షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఇదిలా ఉంటే.. ఈ మూవీ కోసం రామ్ పోతినేని ఫుల్ మేకోవర్ అయినట్లు తెలుస్తోంది. బాడీ లాంగ్వేజ్‌తో పాటు హెయిర్ స్టైల్‌లో కూడా మార్పులు చేసుకున్నాడట.



అయితే.. తాజాగా రామ్‌కు సంబంధించిన కొన్ని క్రేజీ న్యూ పిక్స్ నెట్టింట దర్శనమిచ్చాయి. ఇందులో రామ్ చాలా స్టైలిష్ లుక్‌లో కనిపిస్తూ ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తున్నాడు. అలాగే ఈ సినిమా నెక్స్ట్ షెడ్యూల్ త్వరలో స్టార్ట్ కాబోతుందని తెలుపుతూ పంచుకున్న ఈ ఫొటోస్ ప్రజెంట్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.




## అమెరికాలోనూ 'చెన్నై లవ్ స్టోరీ' జోరు..

బాక్సాఫీస్ వద్ద చిన్న సినిమాలు పెద్ద సంచలనాలు సృష్టించడం కొత్త విషయం కాదు. అయితే ప్రేక్షకుల మనసును హత్తుకునే కంటెంట్ ఉంటే, దేశీయ మార్కెట్‌తో పాటు విదేశాల్లోనూ ఆదరణ లభిస్తుందని మరోసారి నిరూపిస్తోంది కిరణ్ అబ్బవరం 'చెన్నై లవ్ స్టోరీ'. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ రొమాంటిక్ ఎమోషనల్ డ్రామా, ఇప్పుడు ఓవర్సీస్ మార్కెట్‌లోనూ బలమైన వసూళ్లతో దూసుకుపోతోంది. ముఖ్యంగా ఉత్తర అమెరికాలో ఈ సినిమా సాధించిన రెస్పాన్స్ చిత్ర బృందానికి మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది. రవి నంబూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా మంచి వసూళ్లు నమోదు చేస్తోంది. ఇప్పటికే రూ.50 కోట్ల గ్రాస్ దిశగా విజయవంతంగా పయనిస్తున్న ఈ సినిమా, ఉత్తర అమెరికాలో విడుదలైన కేవలం ఐదు రోజుల్లోనే 500,000 డాలర్ల మార్క్‌ను దాటినట్లు చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. కిరణ్ అబ్బవరం కెరీర్‌లోనే ఇది అత్యంత కీలకమైన ఓవర్సీస్ విజయాల్లో ఒకటిగా సినీ వర్గాలు భావిస్తున్నాయి.సాధారణంగా ప్రేమకథా చిత్రాలకు విదేశాల్లో తెలుగు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తుంది. అయితే ఈసారి కేవలం ప్రేమకథ మాత్రమే కాకుండా, వివాహం తర్వాత దాంపత్య జీవితంలో ఎదురయ్యే ఎమోషన్స్ ను చూపించిన విధానం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. అందుకే ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు యువత కూడా ఈ చిత్రానికి మంచి స్పందన ఇస్తున్నారని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమాలో కిరణ్ అబ్బవరం సరసన శ్రీ గౌరీ ప్రియ కథానాయికగా నటించింది. వీరిద్దరి కెమిస్ట్రీ సినిమాకు హైలెట్ గా నిలిచింది. ఈ మూవీని ఎస్.కె.ఎన్, సాయి రాజేష్ సంయుక్తంగా నిర్మించారు. కథను కూడా సాయి రాజేష్ అందించగా, సంగీత దర్శకుడు మణిశర్మ అందించిన పాటలు, నేపథ్య సంగీతం ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటున్నాయి. ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితవవుతున్న 'చెన్నై లవ్ స్టోరీ' రాబోయే రోజుల్లో మరిన్ని రికార్డులు నమోదు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## మా ముఖాలపై దృష్టి పెట్టండి

సినిమా ఇండస్ట్రీలోనూ, బయటా నటీమణుల పట్ల కొందరి ప్రవర్తనపై ఆమె అసంతృప్తిని వ్యక్తం చేశారు. ముఖ్యంగా నెటిజన్లు, కెమెరామెన్లు నటీమణులను చూసే తీరు మారాలని ఆమె అభిప్రాయపడ్డారు. తమ పిరుదుల సైజు లేదా శరీర భాగాలను బట్టి కాకుండా, వెండితెరపై ప్రదర్శించే నటన, ప్రతిభ ఆధారంగానే గుర్తింపు పొందాలని తమలాంటి నటీమణులు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు.కెమెరాలు ఎప్పుడూ నటీమణుల ముఖాలు, వారి నటనపై మాత్రమే దృష్టి పెట్టాలని, అంతేగానీ శరీర భాగాలు ఏ విధంగా కదులుతున్నాయనే దానిపై కాదని ఘాటుగా చెప్పారు. అంతేకాకుండా ఈ సంస్కృతి వెనుక ఉన్న కొన్ని విషయాలను కూడా ఆమె బయటపెట్టారు. ఇండస్ట్రీలో చాలామంది నటీమణులు డబ్బుల కోసమే కెమెరాల ముందు అలాంటి భంగిమలు ఇస్తుంటారని, వారికలా చేసినందుకు డబ్బులు ముడతాయని తనకు తెలుసని చెప్పారు. అలాంటి పనులు కేవలం డబ్బులు తీసుకునే వారి వద్ద మాత్రమే చేసుకోవాలని, అలా కాకుండా స్వచ్ఛందంగా తమ పని తాము చేసుకుపోయే ఇతర నటీమణులతో మాత్రం ఇలాంటి పనులు చేయకూడదని గట్టిగా హెచ్చరించారు. ఎలాంటి దాపరికం లేకుండా చెప్పిన ఈ విషయాలు ఇప్పుడు ఇండస్ట్రీలో పెద్ద చర్చగా మారాయి. మహిళా సెలబ్రిటీల ఆత్మగౌరవం గురించి ఆమె స్పందించిన తీరుకు సోషల్ మీడియాలో నెటిజన్ల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది.



## 'కొరియన్ కనగరాజు' పెద్ద సవాలుగా మారింది..




'కనకరాజు' పాత్ర తన వ్యక్తిగత స్వభావానికి పూర్తి భిన్నంగా ఉంటుందని వరుణ్ తేజ్ పేర్కొన్నారు. ఈ పాత్ర చాలా ఉల్లాసంగా, ఎంతో ఉత్సాహంగా సాగుతుందని తెలిపారు.అనంతపురం-రాయలసీమ యాసను సరిగ్గా పలకడమే కాకుండా, కొరియన్ భాష నేర్చుకుని పెద్ద డైలాగ్స్ చెప్పడం తనకు అతిపెద్ద సవాలుగా మారిందని వివరించారు. కొరియన్ భాషతో మునుపు పరిచయం లేకపోవడంతో, దాని ఉచ్చారణ, టైమింగ్, భావోద్వేగాలను సరిగ్గా పలికించడం కష్టమైందని చెప్పారు. అయితే శారీరకంగా డ్యాన్స్ విషయంలో తప్ప మిగతా విషయాల్లో పెద్దగా ఇబ్బంది అనిపించలేదని, ఈ పాత్ర కోసం జుట్టు పెంచి కొత్త రూపాన్ని తెచ్చామని, ఈ పాత్రను పోషించడం సవాలు కంటే ఎక్కువ సరదాగా అనిపించిందని వెల్లడించారు. కొరియన్ కనకరాజు' అనేది హారర్-కామెడీ ప్రధానాంశంగా సాగే పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రమని వరుణ్ తేజ్ తెలిపారు. ఇందులో మంచి కామెడీ, యాక్షన్ తో పాటు వినూత్నమైన కథాంశం ఉందని చెప్పారు. ఈ కాన్సెప్ట్ టాలీవుడ్‌లో ఇంతకు ముందెన్నడూ రాలేదని, ఈ కొత్త ఆలోచనే తనను బాగా ఆకర్షించిందని పేర్కొన్నారు. ప్రేక్షకులకు కూడా బాగా నచ్చుతుందని నమ్మకంగా ఉన్నట్లు చెప్పుకొచ్చారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**